కలం నిఘా
WWW.KALAMNIGHA.COM
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ శుక్రవారం 28 ఫిబ్రవరి 2025
సంపుటి: 14, సంచిక: 327 పేజీలు 7, వెల: 4.00
Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam

## బాధ్యతలను మరచి మాట్లాడుతున్న కిషన్ రెడ్డి

గత పదేళ్లలో కాలయాపన చేసిన బీఆర్ఎస్
మంత్రి పొన్నం ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు



2

## దేవాదాయశాఖలోకి చార్మినార్ భాగ్యలక్ష్మీ ఆలయం



2

# ఆరు రోజుల్లో... తట్టెడు మట్టి!

## మానవత్వం, నాయకత్వం లేని కాంగ్రెస్ ప్రభుత్వం

- ఎనిమిది మంది ప్రాణాలు కాపాడటంలో నిర్లక్ష్యం
- ఆరు రోజుల్లో ఆచూకీ కనుక్కోలేని దురదృష్టం
- ఎన్డీఆర్ఎఫ్ ఆర్మీ నేవీ నిపుణులు బృందం హాజరు
- అయినా డైరెక్షన్, సమన్వయం చేయలేని దుస్థితిలో ప్రభుత్వం
- కాంగ్రెస్ అవినీతి నిర్లక్ష్యంతో 15 నెలల్లోనే, 4 ప్రాజెక్టులు కూలిపోయినయ్
- ఆందోళనకు దిగిన బీఆర్ఎస్.. అడ్డుకున్న పోలీసులు
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ హరీష్ రావు



**గోదావరిపై ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తుంటే కాంగ్రెస్ సర్కారు నోరెత్తటం లేదు**

**నాగర్ కర్నూలు ఫిబ్రవరి 27(నిఘా న్యూస్):** ఉన్న ప్రాజెక్టులను కాపాడలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లోకి వెళ్లేందుకు తమకు అనుమతి ఇవ్వలేదన్నారు. 'సహాయక చర్యలకు ఇబ్బంది అవుతుందని ఇన్ని రోజులు రాలేదు. ఆరు రోజులు గడిచినా చిక్కుకుపోయిన వారి ఆచూకీపై ఇప్పటికీ స్పష్టత లేదని అన్నారు. వారి కుటుంబాలు ఆందోళన చెందుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఎస్ఎల్‌బీసీ కోసం ఆనాడు ..మిగతా 2లో

### దేవాదులలో ఏడు మంది చనిపోతే...
## ఐదేళ్ల తరువాత అస్తిపంజరాలు దొరికాయి

రెండుమూడు నెలల్లో టన్నెల్ పనుల పునఃప్రారంభం
జగన్‌తో అంటకాగి నీటి చౌర్యానికి సహకరించిన బీఆర్ఎస్.. మంత్రి ఉత్తమ్

2



## కేంద్రాన్ని అడిగి... ఎన్నికల హామీలు ఇచ్చారా!

మెట్రోను అడ్డుకున్నట్లు రుజువు చేస్తారా
సీఎం రేవంత్ స్థాయిని మరిచి విమర్శలు
మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**న్యూఢిల్లీ ఫిబ్రవరి 27(నిఘా న్యూస్):** ఎవరిని అడిగి ఎన్నికల హామీలు ఇచ్చారు. ఎవరిని మీరు విమర్శిస్తున్నారని సిఎం రేవంత్ రెడ్డిపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. మెట్రో రెండోదశను అడ్డుకున్నట్లు రుజువులు చూపాలని సవాల్ చేశారు. విస్తరణకు పైసా లేకున్నా పనులు ఎలా చేపడతారని కూడా ఎదురు ప్రశ్నించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన విమర్శలపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. తాను ఏదైనా ప్రాజెక్టును అడ్డుకున్నట్లు నిరూపించాలని సవాల్ విసిరారు. హైదరాబాద్ మెట్రో రెండోదశ ప్రాజెక్టును కేంద్ర క్యాబినెట్ వద్దకు వెళ్లకుండా కిషన్ రెడ్డి అడ్డుకున్నారని రేవంత్ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. సీఎంగా ఉన్న వ్యక్తి అవగాహనా రాహిత్యంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి తెలంగాణకి సీఎం కావడం రాష్ట్ర ప్రజల దురదృష్టం. కేంద్ర ప్రభుత్వానికి ఒక విధానం ఉంటుంది. దానికి అనుగుణంగానే వ్యవహరిస్తారు. రేవంత్ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతూ దుందుడుకుగా వ్యవహరిస్తున్నారు. కేంద్రం నుంచి డబ్బులు తెచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని ఎన్నికల్లో చెప్పారా అని కిషన్‌రెడ్డి నిలదీశారు. తెలంగాణకు సిఎం రేవంతా లేక తానా అని ప్రశ్నించారు. ప్రధాని మోడీ నాయకత్వంలో మైనింగ్‌లో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. గనుల శాఖలో ..మిగతా 2లో

## భారతీయుల ఐక్యతను చాటిన కుంభమేళా



కుంభమేళాతో ప్రపంచమే ఆశ్చర్య పోయింది
ఎవరికైనా అసౌకర్యం కలిగితే క్షమించండి
కుంభమేలా ముగింపుపై మోడీ వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ ఫిబ్రవరి 27(నిఘా న్యూస్):** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహాకుంభ మేళా ఘనంగా ముగిసింది. 45 రోజుల పాటు సాగిన ఈ కుంభమేళా విశేషాలను ప్రధానమంత్రి ..మిగతా 2లో

## ప్రపంచంతోనే హైదరాబాద్ పోటీ

హెచ్‌సిఎల్ టెక్ క్యాంపస్ ప్రారంభించిన సీఎం



**హైదరాబాద్ ఫిబ్రవరి 27(నిఘా న్యూస్):** దేశంలోనే తెలంగాణ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రైజింగ్‌ను ఎవరూ ఆపలేరని, 2025వ సంవత్సరంలోనే దేశ విదేశాల నుంచి అత్యధిక పెట్టుబడులు సాధించామని, తెలంగాణ వన్ ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చే ప్రయత్నం చేస్తున్నామని రేవంత్ ధీమా వ్యక్తం చేశారు. ఇవి, బయోటెక్ సహా తదితర రంగాల్లో హైదరాబాద్ అగ్రగామిగా ఉందని ..మిగతా 2లో

### తెలుగు రాష్ట్రాల్లో ముగిసిన
## ఎమ్మెల్సీ పోలింగ్

మూడున ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన



**హైదరాబాద్ ఫిబ్రవరి 27(నిఘా న్యూస్):** తెలుగు రాష్ట్రాల్లో ఆరు ఎమ్మెల్సీ స్థానాలకు గురువారం జరిగిన పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఆంధ్రప్రదేశ్ లో 3, తెలంగాణలో 3 ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్ జరిగింది. అయితే, సాయంత్రం 4 గంటల వరకు క్యూ లైన్లలో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. ఏపీలో 2 గ్రాడ్యుయేట్, ఒక టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరిగాయి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోలింగ్ సమయం ముగిసే నాటికి పశ్చిమ గోదావరి జిల్లాలో 65.43 శాతం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. దీంతో పాటు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విశాఖపట్నం జిల్లాలో 87.30 శాతం పోలింగ్ నమోదు అయింది. ఎన్‌టీఆర్ జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ముగిసే సమయానికి 61.99 శాతం నమోదు అయింది. మరోవైపు, తెలంగాణలోని మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ ముగిసింది. ఉమ్మడి కరీంనగర్%-% మెదక్‌నిజామాబాద్ ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి 40.61 శాతం, ఇవే జిల్లాల్లో జరుగుతున్న టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 63.49 శాతం పోలింగ్ నమోదు కాగా వరంగల్ నల్లగొండ ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 76.35 శాతం పోలింగ్ నమోదు అయినట్లు తెలిపారు. కాగా, వచ్చే నెల 3వ తేదీన తుది ఫలితాలను ఎన్నికల కమిషన్ వెల్లడిరచనుంది.

### ఎన్ని చట్టాలు చేసినా...
## కఠినంగా అమలు చేయాలి


మహిళలకు భరోసా ఉందన్న నమ్మకం కలిగించాలి
ప్రభుత్వం, పోలీసులు, ప్రజలకూ బాధ్యత ఉంది
పుణె అత్యాచార ఘటనపై మాజీ సీజేఐ చంద్రచూడ్



**ముంబై ఫిబ్రవరి 27(నిఘా న్యూస్):** మహిళల రక్షణ కోసం తీసుకొచ్చిన చట్టాలను సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని సుప్రీం మాజీ సిజె జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. ఎక్కడికి వెళ్లినా తాము సురక్షితంగా ఉన్నామనే నమ్మకాన్ని మహిళలకు కలిగించాలన్నారు. ఇలాంటి కేసుల్లో సరైన దర్యాప్తు, కఠిన చర్యలు అత్యంత కీలకం అన్నారు. న్యాయవ్యవస్థ, పోలీసులకు పెద్ద బాధ్యత ఉంది. వీరితో పాటు సమాజానికి కూడా అంతే బాధ్యత ఉందని జస్టిస్ డీవై చంద్రచూడ్ ..మిగతా 2లో

## తెలంగాణలో మిస్ వరల్డ్ పోటీలు

వరల్డ్ ఫెస్టివల్‌లో 120కి పైగా పాల్గొనున్న దేశాలు
మే 7 నుంచి 31 వరకు గ్రాండ్ ఫినాలె



**హైదరాబాద్ ఫిబ్రవరి 27(నిఘా న్యూస్):** మిస్ వరల్డ్ పోటీలు అంటే ప్రపంచంలోనే ఓ అరుదైన, అద్వితీయమైన వేడుక. వివిధ దేశాల నుంచి సుందరీ మణులు పాల్గొనే ఈ వేడుకలకు ఈసారి తెలంగాణలోని హైదరాబాద్ వేదిక కానుంది. ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూసే ప్రపంచ అందాల పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యమివ్వడం అనే మాట వింటుంటేనే హైదరాబాద్ జోష్ ..మిగతా 2లో



## కృష్ణాజలాల్లో తాగునీటికే ప్రాధాన్యత

కృష్ణానది యాజమాన్య బోర్డు సమావేశంలో నిర్ణయం

2




## నేడు ఏపీ కేబినేట్ భేటీ

బడ్జెట్‌కు లాంఛనంగా ఆమోదం

**అమరావతి ఫిబ్రవరి 27(నిఘా న్యూస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీలో 2025-26వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌ను చంద్రబాబు సర్కార్ ప్రవేశ పెట్టనుంది. ఎన్నికలు ముగిసిన ..మిగతా 2లో



## కృష్ణాజలాల్లో తాగునీటికే ప్రాధాన్యత

**హైదరాబాద్ ఫిబ్రవరి 27(నిఘా న్యూస్):** తాగునీటికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ రెండు రాష్ట్రాల్లో ఉన్న పంటలను దృష్టిలో ఉంచుకొని శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో ఉన్న నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని కృష్ణానదీ యాజమాన్య బోర్డు సమావేశంలో నిర్ణయించారు. ఛైర్మన్ అతుల్ జైన్ నేతృత్వంలో బోర్డు ప్రత్యేక సమావేశం హైదరాబాద్ జలసౌధలో జరిగింది. తెలంగాణ నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ అనిల్ కుమార్, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఈఎన్సీ వెంకటేశ్వరరావు, ఇంజనీర్లు సమావేశానికి హాజరయ్యారు. రెండు జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటిని వినియోగించుకునే విషయమై సమావేశంలో చర్చించారు. మే నెలాఖరు వరకు తమకు 63 టీఎంసీలు కావాలని తెలంగాణ, 55 టీఎంసీలు కావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు సీఈల సమావేశం అనంతరం వివరాలు సమర్పించాయి. ప్రస్తుతం రెండు జలాశయాల్లో కనీస వినియోగ మట్టానికి ఎగువన 60 టీఎంసీలకు పైగా నీరు ఉంది. ఉన్న కొద్ది పాటి నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని బోర్డు రెండు రాష్ట్రాలకు సూచించింది. తాగునీటికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని, ఉన్న పంటలను దృష్టిలో పెట్టుకొని మిగిలిన నీటిని ప్రణాళికతో వాడుకోవాలని తెలిపింది. పక్షం రోజులకు ఒకసారి పరిస్థితులను సమీక్షించుకుంటూ ముందుకెళ్లాలని సూచించింది.



## కేంద్రాన్ని అడిగి... ఎన్నికల హామీలు ఇచ్చారా!

మొదటి పేజీ తరువాయి...

నూతన పాలసీ తీసుకొచ్చామని.. 12 ఖనిజాల రాయల్టీని పెంచామని తెలిపారు. ఈ ఏడాది జీఎస్ఐ 448 ప్రాజెక్టుల్లో గనుల అన్వేషణ చేపట్టిందని పేర్కొన్నారు. గనుల అన్వేషణలో ప్రైవేట్ రంగాన్ని కూడా భాగస్వామ్యం చేస్తున్నామని ఇందులో భాగంగానే ఈ ఏడాది 12 ప్రైవేట్ కంపెనీలు గనుల అన్వేషణలో భాగస్వామ్యం అయ్యాయని తెలిపారు. ఆఫ్ షోర్ ఏరియాలో ఖనిజాల ఉత్పత్తిని పెంచుతున్నామన్నారు. పలు ఆఫ్ షోర్ మినరల్స్ గుర్తించి వేలం వేయబోతున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 103 బ్లాకుల గనులను వేలం వేశాయని, ఈ వేలం ప్రక్రియలో 14 రాష్ట్రాలు భాగస్వామ్యం అయ్యాయని తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై దృష్టి పెట్టామని పేర్కొన్నారు. మెట్రో రెండోదశ ప్రాజెక్టును కేంద్ర క్యాబినెట్ వద్దకు వెళ్లకుండా కిషన్‌రెడ్డే అడ్డుకున్నారు. తన మిత్రుడు కేసీఆర్ పదేళ్లలో చేయని పని ఇప్పుడు చేస్తే రేవంత్‌రెడ్డికి పేరొస్తుందనే అలా చేశారని రేవంత్ ఆరోపించారు. నాకు రాష్ట్ర ప్రయోజనాల కంటే పేరు ముఖ్యం కాదు. కావాలంటే అనుమతులు, నిధులు తెప్పించి ఆ పేరును కిషన్‌రెడ్డినే తెచ్చుకోమనండి. నేను కూడా ఆయన పేరే ఊరూరా ప్రచారం చేస్తా సన్మానం చేసి గండపెండేరం తొడుగుతా, తెలంగాణ అభివృద్ధికి అవసరమైన 5 ప్రాజెక్టులకు సహకరించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి విన్నవించాం. వాటికి అనుమతులు, నిధులు తీసుకు రావాల్సిన బాధ్యత కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లదే. లేకపోతే వారిద్దరూ గుజరాత్‌కో ఇంకో రాష్ట్రానికో వెళ్లిపోవాలి. తెలంగాణలో వారికి తిండి దండగ అంటూ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దీనికి కిషన్ రెడ్డి ఘాటుగా బదులిచ్చారు.

## ప్రపంచంతోనే హైదరాబాద్ పోటీ

మొదటి పేజీ తరువాయి...

ప్రశంసించారు. మాదాపూర్‌లో హెచ్‌సిఎల్ టెక్ నూతన క్యాంపస్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రసంగించారు. నూతన హెచ్‌సిఎల్ క్యాంపస్ ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. హైదరాబాద్ దేశంలోనే అత్యంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా మారిందని కొనియాడారు. దేశంలోనే తెలంగాణ, హైదరాబాద్ నగరం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం ఏడాదిలోనే దేశవిదేశాల నుంచి అత్యధిక పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. ఉద్యోగ కల్పనలో నంబర్ వన్‌గా నిలిచామని చెప్పారు. ఈ విషయాన్ని గర్వంగా చెబుతున్నానన్నారు. 'తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ల జీడీపీ రాష్ట్రంగా మారుస్తానని నేను చెప్పినప్పుడు అది సాధ్యం కాదని కొందరన్నారు. రెండుసార్లు దావోస్ పర్యటనల్లో రూ. 41 వేల కోట్లు, రూ. 1.78 లక్షల కోట్ల ఎంవోయూలపై సంతకాలు చేసుకున్న తరువాత ఇప్పుడు అది సాధ్యమని నమ్ముతున్నారు. తెలంగాణ రైజింగ్‌ను ఎవరూ ఆపలేరు. మా పోటీ ముంబయి, దిల్లీ, బెంగళూరు, చెన్నైతో కాదని నేను చెప్పినప్పుడు కొంతమంది అది పెద్ద కలనే అవుతుందన్నారు. ఈవీ అడాప్షన్‌లో హైదరాబాద్‌ను నంబర్ వన్‌గా చేశాక, రాష్ట్రాన్ని డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ, లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ, స్కిల్స్, మ్యానుఫ్యాక్చరింగ్, అగ్రి ప్రాసెసింగ్ హబ్‌గా మారుస్తున్నాం. ఇప్పుడు హైదరాబాద్ రైజింగ్ ఆగదు అని ప్రజలు అంటున్నారు. ఇప్పుడు ప్రపంచం మొత్తం అంగీకరిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద లైఫ్ సైన్సెస్ కంపెనీల్లో ఒకటైన ఆమ్జెన్‌ను ఇటీవలే ప్రారంభించాం. ప్రపంచంలోని అత్యుత్తమ సమావేశాల్లో ఒకటైన బయో ఆసియా సదస్సును నిర్వహించాం. గ్లోబల్ కంపెనీగా హెచ్‌సీఎల్ టెక్ దేశానికి గర్వకారణంగా నిలిచింది. ఇది 2.2 లక్షల మందికిపైగా ఉద్యోగులతో 60 దేశాల్లో ఆపరేట్ చేస్తోంది. డిజిటల్, ఇంజినీరింగ్, క్లౌడ్, ఏఐ రంగాల్లో వరల్డ్ క్లాస్ ఆఫరింగ్స్ క్రియేట్ చేస్తున్నారు. 2007లో హైదరాబాద్‌కు వచ్చినప్పటి నుంచి హెచ్‌సీఎల్ అంచలంచెలుగా పెద్ద స్థాయికి ఎదిగిందని రేవంత్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఐటిశాఖ మంత్రి శ్రీధర్ బాబు, సెక్రటరీ జయేశ్ రంజన్ పాల్గొన్నారు.

# ఆరు రోజుల్లో తట్టెడు మట్టా..!

మొదటి పేజీ తరువాయి...

కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 3,300 కోట్లు ఖర్చు పెడితే, భారాస ప్రభుత్వం రూ. 3,900 కోట్లు ఖర్చు చేసింది. ఏపీ ప్రభుత్వం అక్రమంగా కృష్ణా జలాలు తరలించుకుపోతోంది. మన నీటిని ఏపీ తరలించుకుపోతుంటే ప్రభుత్వం ఆపటం లేదన్నారు. రాష్ట్ర ప్రాజెక్టులను కేంద్ర బోర్డుకు అప్పగించేందుకు ఆనాడు భారాస ప్రభుత్వం అంగీకరించ లేదన్నారు. గోదావరిపై ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తుంటే కాంగ్రెస్ సర్కారు నోరెత్తటం లేదు. కృష్ణా జలాలపై మేం నిలదీసిన తర్వాత కేఆర్ఎంబీ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేశారు. రాష్ట్ర హక్కులను కాపాడటంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఇదిలావుంటే బిఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున మందీమార్బలంతో టన్నెల్ వద్దకు రావడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అయితే ఆరు రోజుల తర్వాత తీసింది కేవలం త్తటెడు మట్టి మాత్రమేనని హరీష్ రావు అన్నారు. 8 మంది ప్రాణాలు కాపాడటం పట్ల ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఇదేనా.. అన్నారు. కాంగ్రెస్ సర్కార్ అవినీతి, నిర్లక్ష్యంతో 15 నెలల్లోనే 4 ప్రాజెక్టులు కూలిపోయినయ్. ప్రమాద ఘటనలో చిక్కుకున్న 8 మంది కార్మికుల ప్రాణాలు కాపాడే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఆరు రోజులైనా ఇప్పటి వరకు సరైన డైరెక్షన్ లేదు. మంత్రులు పొద్దున వస్తున్నారు. సాయంత్రం పోతున్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఏమైనా టూరిస్ట్ ప్లేసా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇక ఉన్న ప్రాజెక్టులను కాపాడలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. ఏపీ ప్రభుత్వం అక్రమంగా కృష్ణా జలాలు తరలించుకుపోతోంది. మన నీటిని ఏపీ తరలించుకుపోతుంటే ఈ ప్రభుత్వం ఆపడం లేదు.రాష్ట్ర హక్కులను కాపాడటంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఆయన వెంట మాజీ మంత్రులు జగదీశ్ రెడ్డి, శ్రీనివాసగౌడ్, నిరంజన్ రెడ్డి తదితరులు ఉన్నారు.



# తెలంగాణలో మిస్ వరల్డ్ పోటీలు

మొదటి పేజీ తరువాయి...

పెంచుతుంది. ఒక్కసారి ప్రపంచం దేశాలన్ని హైదాబాద్ వైపు చూపుతిప్పుకునే ఆ రోజు అతి చేరువలోనే ఉంది. ఈ ఏడాది ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్‌లో చెయ్యాలని నిర్వాహకులు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. దీంతో 72వ మిస్ వరల్డ్ పోటీలకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనున్నది. చారిత్రక, వారసత్వ సంపదను ప్రపంచానికి చాటడానికి తెలంగాణకు ఇదొక గొప్ప అవకాశం కానుంది. తెలంగాణ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటేందుకు అరుదైన ఘట్టం కానుంది. ఈ ఏడాది అందాల పోటీలకు అనువైన ప్రదేశంగా తెలంగాణను ఎంచుకోవడం, అందులోనూ హైదరాబాద్ వంటి మహానగరం ఈ వేడుకులకు సిద్ధమవ్వడం ఈ ప్రభుత్వంలో జరిగే ఓ అద్వితీయం వేడుకగా చెప్పవచ్చు. ఈ ఏడాది మేనెలలో నాలుగు వారాల పాటు జరిగే ఈ పోటీల ప్రారంభ, ముగింపు వేడుకలతోపాటు గ్రాండ్ ఫినాలేను సైతం హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్ ఫెస్టివల్‌లో 120కి పైగా దేశాలు పాల్గొంటాయి. బ్యూటీ విత్ ఎ పర్పస్ అనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ మిస్ వరల్డ్ అందాల పోటీల్లో పాల్గొనే దేశ విదేశాల ప్రతినిధులకు తెలంగాణ స్వాగతం పలకబోతుంది. మే 7 నుంచి ఈ అందాల పోటీలు ప్రారంభం కానున్నాయి. మే 31న గ్రాండ్ ఫినాలే ఉంటుంది. ప్రస్తుత మిస్ వరల్డ్ తర్వాత అందాల సుందరి కిరీటాన్ని ఎవరు ధరిస్తారో గ్రాండ్ ఫినాలే రోజు తేలనుంది. గతంలో న్యూఢిల్లీ, ముంబైలో ప్రపంచ సుందరి పోటీలు నిర్వహించారు. 71వ ఎడిషన్ ముంబైలోనే జరిగింది. ప్రపంచంలోనే అత్యుత్తమ మౌలిక సదుపాయాలున్న హైదరాబాద్ ఇప్పటికే పలు అంతర్జాతీయ వేడుకలకు వేదికైంది. ఐటీ, ఫార్మాసూటికల్, రియల్ ఎస్టేట్ వంటి రంగాల్లో దూసుకెళ్తున్న తెలంగాణకు ఈ అవకాశం దక్కడం నిజంగా గర్వించదగ్గ విషయమే. తెలంగాణను పర్యాటకంగా ప్రపంచ పటంలో నిలబెట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు ఇప్పటికే సిద్ధం చేసినట్లు సమాచారం. తెలంగాణ జరూర్ ఆనా నినాదంతో టూరిజం శాఖ దేశ విదేశీ పర్యాటకులను ఇప్పటికే ఆహ్వానాలు పంపుతోంది. గొప్ప చేనేత వారసత్వం, అద్భుతమైన పర్యాటక ప్రదేశాలు, అరుదైన వంటకాలు, విభిన్నమైన కళా వారతస్వమున్న తెలంగాణలో మిస్ వరల్డ్ పోటీలను స్వాగతిస్తున్నామని, మిస్ వరల్డ్ లిమిటెడ్ ఛైర్మెన్, సీఈఓ జూలియా మోర్లీ, తెలంగాణ పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ తాజాగా ఓ అధికారిక ప్రకటన విడుదల చేసారు. మిస్ ఇండియా పోటీలు అంటేనే సుందరీమణుల అలరిస్తారు. అందులోనూ మిస్ వరల్డ్ పోటీలు అంటే ఇంక మాటల్లో చెప్పక్కర్లేదు. ఎంత ఆహ్లాదంగా ఉంటుంతో, అంతే స్థాయిలో వివిధ దేశాల యువతుల మధ్య గట్టిపోటీ కూడా సర్వసాధారణం. ఈ పోటీల వేదికగా హైదరాబాద్ బ్రాండ్ వాల్యూని మరింత పెంచడంతోపాటు, ప్రపందేశాల ప్రతినిధులను ఆకట్టుకునేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేసింది తెలంగాణ ప్రభుత్వం.

## ఎన్ని చట్టాలు చేసినా... కఠినంగా అమలు చేయాలి

మొదటి పేజీ తరువాయి...

అన్నారు. మహారాష్ట్రలోని పుణెలో 26 ఏళ్ల యువతిపై బస్సులో ఓ దుండగుడు అత్యాచారానికి పాల్పడిన ఘటన ప్రజల్లో ఆగ్రహానికి కారణమైంది. రాజకీయంగా దుమారం రేపుతోంది. దీనిపై సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. నిర్భయ ఘటన తర్వాత చట్టాల్లో ఎన్నో మార్పులు వచ్చాయి. కేవలం చట్టాలతోనే అలాంటి ఘటనలను నివారించలేం. అందుకు ప్రభుత్వం, పోలీసులు, ప్రజలు కూడా బాధ్యతతో వ్యవహరించాల్సి ఉందన్నారు. అత్యంత రద్దీగా ఉండే బస్ స్టేషన్‌లలో ఒకటైన స్వర్‌గేట్‌లో మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఈ దారుణం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం తన స్వగ్రామానికి వెళ్లేందుకు బస్‌స్టేషన్‌కు చేరుకున్న యువతితో నిందితుడు మాటలు కలిపాడు. అక్క అని సంబోధిస్తూ నమ్మించాడు. గ్రామానికి వెళ్లే బస్సు మరో చోట ఉందని చెప్పి బస్ స్టేషన్‌లోనే దూరంగా ఎవరూ లేని చోట ఆగి ఉన్న మహారాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్ దగ్గరకు ఆమెను తీసుకెళ్లాడు. బస్సులోకి వెళ్లేందుకు యువతి తటపటాయించడంతో లోపల ప్రయాణికులు ఉన్నారని, నిద్రలో ఉండటంతో వాళ్లు లైట్లు వేసుకోలేదని నమ్మించాడు. బస్సులోకి యువతి ప్రవేశించగానే తలుపు వేసి అత్యాచారానికి పాల్పడ్డాడు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడు దత్తాత్రయ రామదాస్ (36)గా పోలీసులు గుర్తించారు. అతడిపై అనేక కేసులు ఉన్నాయని, 2019 నుంచి బెయిల్ మీద ఉన్నాడని తెలిపారు. రామదాస్‌ను పట్టుకొనేందుకు 8 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అత్యాచారం జరిగిన ప్రాంతానికి 100 మీటర్ల దూరంలోనే పోలీస్ స్టేషన్ ఉండటం గమనార్హం. నిందితుడి గురించి సమాచారం ఇచ్చిన వారికి రూ. లక్ష రివార్డు ఇస్తామని పుణె పోలీసులు వెల్లడిరచారు. ఇక ఈ ఘటనపై మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిండే స్పందించారు. ఈ కేసుపై తమ ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టిసారించిందని, నిందితుడిని త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు.

## భారతీయుల ఐక్యతను చాటిన కుంభమేళా

మొదటి పేజీ తరువాయి...

నరేంద్రమోదీ తన బ్లాగ్‌లో రాశారు. ఇంత పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించడం అంత సులువు కాదన్నారు. ఏర్పాట్ల విషయంలో భక్తులెవరైనా అసౌకర్యానికి గురైతే గనుక అందుకు క్షమించాలని కోరారు. 'ఐక్యత కోసం జరిగిన మహాయజ్ఞం దిగ్విజయంగా ముగిసింది. భారతీయ ఐక్యతకు కుంభమేళా నిదర్శనంగా నిలిచింది. అంచనాలను మించి వివిధ ప్రాంతాల నుంచి కోట్లాది మంది భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. భారత్ కొత్త శక్తితో ముందుకు సాగుతోందని, నవ భారత్‌ను నిర్మించే కొత్త శకం వచ్చిందని చెప్పేందుకు ఇదే నిదర్శనం అని అన్నారు. ఇంత గొప్ప కార్యక్రమాన్ని దేనితోనూ పోల్చలేం. త్రివేణి సంగమం నదీ తీరానికి అన్ని కోట్ల మంది ఎలా వచ్చారా అని యావత్ ప్రపంచం ఆశ్చర్యపోతోంది. ఈ భక్తులెవరికీ అధికారిక ఆహ్వానాలు పంపలేదు. అయినా పవిత్ర సంగమంలో పుణ్యస్నానాల కోసం వారంతా తరలివచ్చారు. నదిలో స్నానమాచరించిన తర్వాత వారి ముఖాల్లో కన్పించిన సంతోషం, సంతృప్తి నేనెప్పటికీ మర్చిపోలేను. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు చాలామంది వ్యయ ప్రయాసలకోర్చి కుంభమేళాకు రావడం ఆనందంగా ఉందని మోదీ రాసుకొచ్చారు. ఈసందర్భంగా మహాకుంభ మేళాను విజయవంతం చేసిన యూపీ ప్రభుత్వం, సహకరించిన ప్రయాగ్‌రాజ్ ప్రజలు, భక్తులకు మోదీ ధన్యవాదాలు తెలిపారు. ఇంతటి పెద్ద కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా నిర్వహించడం అనేది అంత సులువు కాదని తెలుసు. మా పూజల్లో ఏదైనా లోపం ఉంటే క్షమించాలని ఆ గంగా, యమునా, సరస్వతి మాతలను ప్రార్థిస్తున్నా. భగవంతుని స్వరూపాలుగా భావించే భక్తులకు సేవ చేయడంలో ఏదైనా లోపం ఉంటే అందుకు ప్రజలు కూడా క్షమించాలని కోరుతున్నా అని మోదీ రాసుకొచ్చారు. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు 45 రోజుల పాటు సాగిన మహా కుంభమేళాకు దేశ విదేశాల నుంచి భక్తులు పోటెత్తారు. సామాన్య పౌరులతో పాటు పలువురు రాజకీయ, సినీ రంగాలకు చెందిన ప్రముఖులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఫిబ్రవరి 10, ప్రధాని మోదీ ఫిబ్రవరి 5న కుంభమేళాను సందర్శించి పుణ్యస్నానం చేశారు.

## దేవాదులలో ఏడు మంది చనిపోతే... ఐదేళ్ల తరువాత ఆస్తిపంజరాలు దొరికాయి



**హైదరాబాద్ ఫిబ్రవరి 27(నిఘా న్యూస్):** రెండు, మూడు నెలల్లో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు పునః ప్రారంభిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.రెండు మూడు రోజుల్లో సహాయక చర్యలు పూర్తి చేస్తామని అన్నారు. పదేళ్లపాటు బీఆర్ఎస్ అధికారంలో ఉందని, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ అనుమతుల గురించి మాట్లాడుతున్నారని చెప్పారు. అప్పుడు మాట్లాడని నేతలు ఇప్పుడు మాట్లాడటం విడ్డూరంగా ఎందని విమర్శించారు. మాజీ మంత్రి హరీష్‌రావు మాటలు పూర్తి అబద్దాలు, గొబెల్స్ ప్రచారమేనని విమర్శించారు. ఎస్ఎల్బీసీ ద్వారా 30 టీఎంసీలు గ్రావిటీ ద్వారా వస్తుంటే బీఆర్ఎస్ నేతలె పనులు వదిలిపెట్టి వెళ్లారని చెప్పారు. వాళ్లు సరైన పని చేసి ఉంటే తెలంగాణలో 30 టీఎంసీలు నీళ్లు వచ్చి మూడు నాలుగు లక్షల ఎకరాల నల్గొండ భూములు సాగులోకి వచ్చేవని అన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో జరిగిన ప్రమాదాన్ని అందరికీ చూడటానికి అనుమతిస్తున్నామని చెప్పారు. వారి హయాంలో ఎన్ని ప్రమాదాలు జరిగినా ప్రతిపక్షంలో ఉన్న తమకు ఎలాంటి అనుమతులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. వాళ్ల హయాంలో రూ. 1.81 లక్షల కోట్లు ఖర్చుపెట్టి నామమాత్రపు పనులు చేశారని మండిపడ్డారు. వాళ్ల హయాంలో నీటిపారుదుల శాఖను నిర్వీర్యం చేసిన ఘనత కేసీఆర్, హరీష్ రావులకు దక్కుతుందని చెప్పారు. తాము ప్రజాస్వామ్యంగా, పారదర్శకంగా ముందుకు పోతున్నామని చెప్పారు. వాళ్లు శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం బ్లాస్ట్ జరిగి, 9 మంది చనిపోతే ఒక్కరూ కూడా ఎందుకు పరామర్శకు రాలేదని ప్రశ్నించారు. ఆరోజు రేవంత్ రెడ్డి వస్తుంటే కారులో అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారని గుర్తుచేశారు. దేవాదులలో ఏడు మంది చనిపోతే, ఆస్తిపంజరాలు ఐదేళ్ల తర్వాత దొరికాయని చెప్పారు. అప్పుడు హరీష్ రావు ఎప్పుడైనా ఆ విషయం గురించి మాట్లాడావా అని నిలదీశారు. ఎన్నో ప్రమాదాలు జరిగినప్పుడు వారి హయాంలో అడిగే నాథుడే లేరన్నారు. ఇక్కడికి వచ్చి పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మీరు జగన్‌తో కుమ్మక్కై ప్రగతిభవన్‌లో విందులు, వినోదాలు చేసుకుంటుంటే జగన్ కృష్ణానదిని దోచుకువెళ్లారని విమర్శించారు పాలమూరు రంగారెడ్డిలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ. 27,500 కోట్లు ఖర్చుపెట్టి ఒక ఎకరాకు కూడా నీరందించలేదని ధ్వజమెత్తారు. ఎస్ఎల్‌బీసీకి కరెంట్ కట్ చేస్తే డీ ఓటరింగ్ చేయలేక పనులు ఆగిపోయాయని చెప్పారు. అప్పుడు జగదీశ్ రెడ్డి మంత్రిగా ఉన్నాడు ఏమి చేశారని ప్రశ్నించారు. తనకు హెలికాప్టర్‌లో తిరగాలని తనకు ఏ మాత్రం లేదని, తాను గతంలో పైలట్‌ను అని గుర్తుచేశారు.

## దేవాదాయశాఖలోకి చార్మినార్ భాగ్యలక్ష్మీ ఆలయం




**హైదరాబాద్ ఫిబ్రవరి 27(నిఘా న్యూస్):** పాతబస్తీలోని ఛార్మినార్‌ను ఆనుకుని ఉన్న భాగ్యలక్ష్మి ఆలయం అంటే తెలుగు రాష్ట్రాల్లో ప్రతీ హిందువుకూ ఓ సెంటిమెంట్. మైనార్టీలు అధికంగా ఉన్న ప్రాంతంలో ఏర్పాటైన ఆలయం కావడం వల్లనో, లేక కోరిన కోర్కెలు తీర్చే మహిమగల దేవతగా పేరొందడం వల్లనో, భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆలయం దర్శానికి నిత్యం భక్తులు భారీగా తరలివస్తుంటారు. అంతేకాదు బీజేపీ కేంద్ర పెద్దలు అమిత్ షా, నడ్డా వంటి కీలక నేతలు సైతం హైదరాబాద్ వచ్చారంటే తప్పకుండా ఛార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారిని దర్శించుకోకుండా వెళ్లరు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం బీజేపీ నేతలకు ఆనవాయితీగా వస్తోంది. అంతేకాదు ఇటీవల కాలంలో పొలిటికల్ పార్టీల మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లకు, ప్రమాణాలకు భాగ్యలక్ష్మీ ఆలయం వేదికగా మారింది. అంతలా హిందువుల సెంటిమెంట్ ఈ ఆలయంతో పెనవేసుకుని ఉంది. హిందూ, ముస్లింల ఐక్యతతోపాటు, మత విద్వేషాలు చెలరేగకుండా చూడాల్సిన సున్నితమైన ప్రదేశం కూడా ఈ భాగ్యలక్ష్మి ఆలయం. ఇంతలా ప్రధాన్యత ఉన్న భాగ్యలక్ష్మి ఆలయం తాజాగా దేవాదాయశాఖ ఆధీనంలోకి వెళ్లనుంది. ఇకపై హైదరాబాద్ పాతబస్తీలో చార్మినార్ భాగ్యలక్ష్మీ ఆలయ నిర్వహణ దేవాదాయశాఖ పరిధిలోకి రానుంది. ఈ మేరకు దేవాదాయ శాఖను ట్రైబ్యునల్ ఆదేశిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. భాగ్యలక్ష్మీ ఆలయ చరిత్ర గురించి మాట్లడుకుంటే.. 1960 సంవత్సరంలో చార్మినార్ వద్దనున్న ఈ అమ్మవారి ఆలయ పరిధిలో బస్సు ప్రమాదం జరగడంతో అమ్మవారి విగ్రహం కూలిపోయింది. స్థానిక భక్తులు విరాళాలు సేకరించి అమ్మవారి విగ్రహాన్ని తిరిగి ప్రతిష్టించారు. అంతకుముందు పోచమ్మ పేరుతో ఉన్న అమ్మవారి పేరును అప్పటి నుంచి భాగ్యలక్ష్మీ అమ్మవారిగా మార్చారు. అలా నాటి నుంచి ఆలయ నిర్వహణ బాధ్యతలు చూసే మహంత్ రామ్‌చంద్ర దాసు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజ్ మోహన్ దాసు అనే వ్యక్తిని పూజారిగా నియమించారు. టెంపుల్ ట్రస్టీ మీద గతంలో ఉన్న సుప్రీంకోర్టు తీర్పు కారణంగా హెరిడెటరీ ట్రస్టీ ఆర్డర్స్‌తో ఆలయాన్ని తన ఆధీనంలోకి తీసుకొని ఆదాయాన్ని రాజ్ మోహన్‌దాసు ఒక్కరే అనుభవిస్తూ వచ్చారు. దీనిపై మహంత్ రామ్‌చంద్ర దాసు కుమార్తె భాగ్యలక్ష్మీ ఆలయం అజామాయిషీ చేస్తున్న వారిపై కోర్టును ఆశ్రయించారు. కోట్లాది రూపాయాల ఆలయ నిధులను ప్రస్తుత నిర్వహకులు దుర్వినియోగం చేస్తున్నట్టు సాక్షాధారాలను కూడా ట్రిబ్యునల్ దృష్టికి తీసుకెళ్లడంతో భాగ్యలక్ష్మీ ఆలయాన్ని దేవాదాయ శాఖకు అప్పగించాలని తాజాగా తీర్పు ఇచ్చినట్టు దేవాదాయశాఖ అధికార వర్గాల సమాచారం. ప్రస్తుతం ఉన్న భాగ్యలక్ష్మీ ఆలయ నిర్వహణ బాధ్యతను మహంత్ మనోహర్ దాసు, మహంత్ రామ్‌చంద్రదాసు నుంచి దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకోనుంది. 1960 దశకం నుంచి వీరు ఆలయ నిర్వహణ భాధ్యతలు చూస్తున్నారు. ఇప్పుడు నిర్వహణ బాధ్యతలను దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకువచ్చేందుకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ ఆలయానికి తక్షణమే ఈఓను నియమించి ఆలయంలో ఎటువంటి అవకతవకలులేకుండా , అభివృద్ధిలో ముందుకు తీసుకు వెళ్ళాలని దేవాదాయ శాఖ కమిషనర్‌ను ట్రిబ్యునల్ ఆదేశించింది. ఈ ఆలయ ఆదాయాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్న ఫిర్యాదులపై కోర్టు విచారణ అనంతరం ఈ ఆదేశాలు జారీ అయినట్టు ఆలయ వర్గాలు తెలిపాయి. అంతేకాదు ఇప్పటి వరకూ ఆలయ ఆదాయం, ఖర్చులు ఇతర వివరాలను సేకరించడంతోపాటు భక్తుల విరాళాలు, నిధుల దుర్వినియోగంపై విచారణ జరపడంతోపాటు, ఒకవేళ అవకతవకలు జరిగితే తగిన చర్యలు తీసుకోవాలని ట్రిబ్యునల్ ఆదేశించినట్లు తెలుస్తోంది.

## నేడు ఏపీ కేబినేట్ భేటీ

మొదటి పేజీ తరువాయి...

తర్వాత పూర్తి స్థాయిలో ఈ బడ్జెట్ ప్రవేశ పెట్టనుంది. ఇందులో భాగంగా శుక్రవారం జరిగే కేబినేట్ సమావేశం బడ్జెట్‌కు లాంఛనంగా ఆమోదం తెలుపనుంది. ఈ మేరకు ఉదయం 9 గంటలకు ఏపీ కేబినేట్ సమావేశం జరగనుంది. ఈ మంత్రి మండలి సమావేశంలో దీనికి ఆమోదం తెలువుతుంది. ఆ తర్వాత ఉదయం 10 గంటలకు శాసన సభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. వ్యవసాయ బడ్జెట్‌ను మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రవేశ పెట్టనున్నారు. కౌన్సిల్ లో మంత్రి కొల్లు రవీంద్ర బడ్జెట్ ను ప్రవేశ పెట్టనుండగా వ్యవసాయ బ్జడెట్ ను మంత్రి పొంగూరు నారాయణ ప్రవేశ పెట్టనున్నారు.

# బాధ్యతలను మరచి మాట్లాడుతున్న కిషన్ రెడ్డి

### గత పదేళ్లలో కాలయాపన చేసిన బీఆర్ఎస్

### మంత్రి పొన్నం ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు

**సిద్దిపేట ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** తెలంగాణలోని ప్రాజెక్టులు పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశారని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. గత పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న తమ నాయకుడిని బీఆర్ఎస్ పార్టీ సంప్రదించలేదని రాష్ట్రానికి ఏం కావాలో అడగలేదని, ప్రధాని వస్తే కేసీఆర్ కలవడంలేదని ఏదేదో చెప్పి కాలం గడిపారని చెప్పారు. తెలంగాణ ప్రాజెక్టుల కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎంపీలు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని చాలాసార్లు కలిసి అడిగామని గుర్తుచేశారు. ఫెడరల్ వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం అనే సంబంధాల దృష్ట్యా రాష్ట్రానికి అవసరమైన అన్ని ప్రాజెక్టులు అడుగుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా గురువారం హుస్నాబాద్ టౌన్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటు హక్కును మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు వినియోగించు కున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రానికి నేను నీకు రావాల్సిన ఏ ప్రాజెక్టు రాకపోయినా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బాధ్యత వహించాల్సి ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇప్పటి వరకు మెట్రో మలిదశ , మూసీ, ఓఆర్ఓఆర్, ట్రిపుల్ ఆర్ , హైదరాబాద్ తాగునీటి సమస్య ఇతర కార్యక్రమాలకు సంబంధించి ఉపాధి అవకాశాలు మెరుగుపడే అంశాలకు సంబంధించి అనేకమైన ప్రాజెక్టులు కేంద్రానికి సమర్పించామని తెలిపారు. కేంద్రం తెలంగాణ రాష్ట్ర విభజనకు సంబంధించిన హామీలు నెరవేర్చాల్సి ఉందని అన్నారు. కిషన్ రెడ్డి రాష్ట్రానికి నిధులు తేకపోతే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ వేరు కాదని గమనించాల్సి వస్తోందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఢిల్లీలో దోస్తీ గల్లీలో కుస్తి అని ముందు నుంచి చెబుతున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం దేశానికి రోల్ మోడల్‌గా తీసుకున్న కుల సర్వేపై మొదటి వారంలో శాసన సభలో చట్టం చేసి రాజకీయ విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చేసే తీర్మానాన్ని చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కేంద్రం ఎప్పుడైతే ఈబీసీకి సంబంధించి షెడ్యూల్లో మార్చుకున్నారో అదేవిధంగా దీనిని కూడా దాని మాదిరిగానే మార్చాల్సిందేనని, రాజకీయ కారణం చూపిస్తే సరిపోదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గుజరాత్‌లో ప్రధాని మోదీ స్టేట్మెంట్ ఉంది దాని మాదిరిగానే రిజర్వేషన్లు ఇస్తున్నామని అన్నారు. కొంతమంది నేతలు తప్పుడు ప్రచారాలు చేసి మత పరమైన పబ్బం గడుపుతున్నారని మండిపడ్డారు. పాకిస్తాన్ - ఇండియా అంటూ నేతలు రెచ్చ గొడుతున్నాని ధ్వజమెత్తారు. తమకు తెలంగాణ ప్రయోజనాలు ప్రజల అభివృద్ధి ముఖ్యమని స్పష్టం చేశారు. తమిళనాడులో ఎన్ని రాజకీయ విభేదాలు ఉన్న అభివృద్ధి ప్రయోజనాలు విషయంలో అందరూ ఒక్క మాట మీదనే ఉంటారని చెప్పారు. తెలంగాణకు సంబంధించిన ప్రయోజనాల విషయంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతో కేంద్రంలో ఉన్న బీజేపీ కలిసి వచ్చి పెద్దన్న పాత్ర పోషించి నిధులు కేటాయించే ప్రయత్నం చేయాలని కోరారు. అది కేంద్ర ప్రభుత్వం బాధ్యతని, లేదంటే తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. మాజీ మంత్రి కేటీఆర్ మాటలు వింటే నవ్వువస్తోందని విమర్శించారు. ఢిల్లీలో కాంగ్రెస్ ఓడిపోతే ట్వీట్ చేస్తున్నారు. పంటలు ఎండిపోతే ట్వీట్ చేస్తున్నారని చెప్పారు. తమ ప్రభుత్వం తాగు, సాగు నీటికి చర్యలు తీసుకుంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# రంజాన్ మాసం ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష






**నారాయణపేట ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** రంజాన్ మాసం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ఛాంబర్ లో గురువారం అధికారులతో అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రంజాన్, సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లు, కల్పించాల్సిన సౌకర్యాలపై సమీక్ష జరిపారు. ఎలాంటి ఇబ్బందులు, లోటుపాట్లకు తావులేకుండా జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాలలో మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా సమన్వయంతో పని చేయాలని అధికారులకు సూచించారు. ప్రధానంగా ఎక్కడ కూడా తాగునీరు, పారిశుధ్యం వంటి సమస్యలు తలెత్తకుండా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందికి బాధ్యతలు పురమాయిస్తూ, నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం అంతరాయం లేకుండా చూడాలని, వీధి లైట్ల మరమ్మతులు జరిపించాలన్నారు. బోర్లు, పైప్ లైన్ మరమ్మతులు ఉంటే ముందస్తుగా చేపట్టాలని తెలిపారు. అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ప్రార్థనా సమయాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని విద్యుత్ శాఖ డి.ఈ. కి సూచించారు. మసీదులు, ఈద్గాల వద్ద పారిశుధ్య సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడ కూడా శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, సమస్యాత్మక ప్రాంతాలలో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. కాగా, వేసవి సీజన్ ప్రారంభం అవుతున్న దృష్ట్యా తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని మున్సిపల్ కమీషనర్లను సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ యాక్షన్ ప్లాన్ ప్రకారం ముందుకు పోతామని తెలిపారు. పోలీస్,విద్యుత్ డిఎంహెచ్వో ఆర్డీవో సివిల్ సప్లై మున్సిపల్ కమీషనర్లు తదితర శాఖలు వారు సమిష్టి కృషి చేయాలన్నారు. ఆర్డీవో మాట్లాడుతూ రెవిన్యూ సంబందించిన అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. మున్సిపల్ కమీషనర్ లు రంజాన్ పండుగ రోజు శ్యామ్యానాలు తాగునీరు తదితర ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ లింగయ్య మాట్లాడుతూ రంజాన్ హెూలీ,ఉగాది పండుగలకు శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. రంజాన్ పండుగ రోజు ఈద్గాలో దాదాపు పదివేల మంది ప్రార్థనలో హాజరు అవుతారని ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఇనాయా ట్రస్ట్ సేవలు అభినందనీయం

### ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**మౌలాలి, ఫిబ్రవరి 27(నిఘా న్యూస్):** ఇనాయ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మౌలాలిలో పేద ముస్లిం వికలాంగులకు, వితంతులకు రంజాన్ మాసం సందర్భంగా బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ పేద ముస్లిం ఇలాంటి కార్యక్రమాలు మునుముందు కొనసాగించాలని ఆయన సూచించారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని వికలాంగులకు వితంతువులకు బియ్యం పంపిణీ చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు బద్రుద్దీన్ సయ్యద్ అభిబ్ సయ్యద్ అఫ్సర్ మాజిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## శివరాత్రి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



**మల్లాపూర్, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** మహా శివరాత్రి సందర్భంగా మల్లాపూర్ డివిజన్ శాంతి యూత్ క్లబ్ ఎస్.వి.శశిధర్ ఆధ్వర్యంలో ఎస్ వై సి మునిసిపల్ గ్రౌండ్ లో బుధవారం రాత్రి నిర్వహించిన చాందిని క్రికెట్ టోర్నమెంట్ కార్యక్రమానికి గ్రేటర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై టాస్ వేసి టోర్నమెంట్ ను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా క్రికెట్ నిర్వహించడం యువకులను ప్రోత్సహించడంతో పాటు ఉపవాసం ఉండే వారికి ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శాంతి యూత్ క్లబ్ అధ్యక్షులు కొల్లూరి రవి,ప్రధాన కార్యదర్శి కోయలకొండ రాజేష్, ఉపాధ్యక్షులు మెండ రఘు, నిర్వాహకులు తాటిపల్లి శ్రీనివాస్,బండి సంపత్, పి ఆర్. మెహ్రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమం




**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి వినుత కోటా ఆధ్వర్యంలో ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ స్ఫూర్తితో శ్రీకాళహస్తి పట్టణం నందు ప్రతి గురువారం బస్టాండ్ సెంటర్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మండల ఇంచార్జ్ పేట చంద్రశేఖర్, పట్టణ ప్రధాన కార్యదర్శి పేట చిరంజీవి, లక్ష్మణ్, దినేష్, ఏర్పేడు మండల ప్రధాన కార్యదర్శి వెంకటరమణ యాదవ్, లక్ష్మణ్ యాదవ్, మనీ, ముని చంద్ర, కత్తిమని, మణికుమార్, వీర మహిళలు, శారద, గాయత్రి, బత్తేమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్వీఆర్ క్రికెట్ టోర్నమెంట్ రన్నరప్ గా నిలిచిన టైగర్ టీం



**చిలుకానగర్, ఫిబ్రవరి 27(నిఘా న్యూస్):** మహాశివరాత్రి జాగరణలో భాగంగా ప్రతి సంవత్సరం సింగిరెడ్డి వికాస్ రెడ్డి, (ఎస్వీఆర్) ఆధ్వర్యంలో కుషాయిగూడ వాలీబాల్ గ్రౌండ్ పద్మావతి కాలనీ వెంకటేశ్వర టెంపుల్ ఎదురు మైదానంలో లో ఏర్పాటుచేసిన క్రికెట్ టోర్నమెంట్లో ఉప్పల్ చిల్కానగర్ డివిజన్ కు చెందిన సేవ్ ద టైగర్స్ టీం కెప్టెన్ కొల్లూరి శ్యామ్, వారి టీం రెండవ స్థానం రన్నరపుగా రూ 30 వేలు గెలుపొందడం జరిగింది. గెలుపొందిన టీం సేవ్ ద టైగర్స్ కు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ అభినందిస్తూ అనంతరం గెలుపొందిన టీం సభ్యులతో, ట్రోఫితో గ్రూప్ ఫోటో దిగడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు ఏదుల్ల కొండల్ రెడ్డి,ముద్దం శ్రీనివాస్ యాదవ్, కొల్లూరి శ్యామ్ టీం సభ్యులు ఎం.డి.గౌస్, తిరుపతి శ్యామ్, రాకేష్, రవి మస్తాన్, భాను, వాసు ,ప్రసాద్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## నిజాంపేట్‌లో ఎమ్మెల్సీఎన్నికల పోలింగ్



నిజాంపేట్, ఫిబ్రవరి 27(నిఘా న్యూస్): సంగారెడ్డి జిల్లాలో గురువారం జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల లో ఒక గ్రాడ్యుయేట్ రెండు టీచర్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు దిరారు. ఉమ్మడి మెదక్ కరీంనగర్ నిజామా బాద్ అదిలాబాద్ జిల్లాలో పట్టభద్రుల నియోజకవర్గంతో పాటు ఉపాధ్యాయ నియోజకవర్గం ఉమ్మడి వరంగల్ ఖమ్మం నల్గొండ జిల్లాలో ఉపాధ్యాయులు ఎన్నికలు జరిగాయి పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 56 మంది అభ్యర్థులు నిలవగా కరీంనగర్ నిజామా బాద్ మెదక్ అదిలాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలో (15) అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్లు మొత్తం (314) కు (209) ఓట్లకు పోలింగ్ జరగగా 68.15 శాతంపోలింగ్ నమోదయింది టీచర్స్ ఎమ్మెల్సీ ఓటర్లు 23 గాను 100శాతం పోలింగ్ నమోదయింది. గెలుపు కోసం కాంగ్రెస్ బిజెపి స్వతంత్రులు శక్తివంచన లేకుండా పోరాడుతున్నారు. మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో విజయం సాధించి శాసనమండలిలో తమ బలాన్ని పెంచుకోవాలని బిజెపి భావిస్తుంది.

ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా కాంగ్రెస్ కూడా గెలిచి పట్టు నిల్చుకోవాలని ప్రయత్నంలో పావులు కలిపింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా కలెక్టర్, డి.ఎస్.పి రెవెన్యూ అధికారులు పర్యవేక్షించారు. మార్చ్ మూడున ఓట్ల లెక్కింపు చేపట్ట బోతున్నారు. ఎన్నికల అధికారులు బ్యాలెట్ బాక్స్‌లు సి లింగ్ చేసి లాకర్లు వేసి బస్సులో భద్రతా బలగాలతో తరలించారు.

## డ్రైనేజీ సమస్యలను పరిష్కరించండి

### జలమండలి అధికారులతో కార్పొరేటర్ సమీక్ష



నాచారం, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్) నాచారం డివిజన్ లోని భూగర్భ డ్రైనేజీ సమస్యల పరిష్కారాని ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి మంజూరు చేయించిన పనులకు టెండర్లు పిలవాలని జలమండలి జనరల్ మేనేజర్ సంతోష్ కుమార్ ను నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి కోరారు. భూగర్భ డ్రైనేజ్ సమస్యలు డివిజన్ లో దాదాపుగా పనులు పూర్తయ్యాయని గత వారంలో ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి పర్యటించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకుని వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జలమండలి అధికారులను కలిసి పనులకు టెండర్లను ఆహ్వానించాలని కోరడం జరిగిందని అన్నారు. అధికారుల స్పందించి త్వరలోనే టెండర్లు ఆహ్వానించి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయి జన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వెలుగ్గుట్టలో వైభవంగా శివ పార్వతుల కళ్యాణం



**ఉప్పల్, ఫిబ్రవరి 27(నిఘా న్యూస్):** ఉప్పల్ క్రికెట్ స్టేడియం సమీపంలో ఉన్న వెలుగుట్టలో కొలువు తీరిన శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయం పుణ్య క్షేత్రం మహాశివరాత్రి సందర్భంగా పెద్ద ఎత్తున ముస్తాబు చేశారు. రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ నేతృత్వంలో కొనసాగుతున్న దేవాలయంలో పాలక మండలి ధర్మకర్తలు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా విశిష్ట ఏర్పాట్లు చేసి భక్తులు విశిష్ట పూజలు చేసి పర్వశం పొందారు. బుధవారం రాత్రి దేవాలయం పాలక మండలి ఆధ్వర్యంలో శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వార్ల కళ్యాణ మహెూత్సవం కార్యక్రమాలు సాక్షాత్తు ఆ శివ పార్వతులు భువి నుండి దివి వచ్చి కళ్యాణం జరుపున్నారనే అనుభూతితో ఉట్టి పడేలా జరిగింది. కళ్యాణ మహెూత్సవం వెదపండితులచే ఒగ్గు డోళ్ళ చప్పుళ్లతో జరిగాయి. ఉపవాస దీక్షలు,జాగరణ చేసే భక్తులే కాకుండా, ఉప్పల్,రామంతాపూర్, తార్నాక, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఈ కళ్యాణ మహెూత్సవ కార్యక్రమాలు తిలకించారు. తదనంతరం రాత్రి పదకొండున్నరకు లింగోద్భవకాల అభిషేకాలు ప్రారంభం కాగా, అభిషేక సేవలో భక్తులు పాల్గొని సర్వ గ్రహ భాదల నివారణ కోసం శివ పార్వతుల అనుగ్రహం పొందారు. కనీవినీ ఎరుగని రీతిలో జరిగిన మహాశివరాత్రి పర్వదినం ఉత్సవాలు పురష్కరించుకుని దేవాలయం ఈవో రమాదేవి, పాలక మండలి చైర్మన్ జన్ని రఘు, ధర్మకర్తలు ప్యాట మురళి కృష్ణ, సోమ బాలమణి, మాదడి రమేష్ రెడ్డి,గన్నారం విజయ్ కుమార్, రోండ్ల శ్రీకాంత్ రెడ్డి,సోమ జంగయ్యలతో పాటు ట్రస్ట్ సభ్యులు, ప్రముఖ న్యాయవాది గొరిగే మల్లేష్ కురుమ తదితరులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ప్రశాంత వాతావరణంలో ఆయా కార్యక్రమాలు జరిగాయి.

## పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలి



**నారాయణపేట, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** నారాయణపేట జిల్లా కృష్ణ మండల పరిధిలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఉదయం 9 గంటల కల్లా కార్యాలయంలో ఉండాలి. సాయంత్రం నాలుగు గంటల వరకు విధులు నిర్వహించాలని ఎంపిఓ డి విజయలక్ష్మి గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండడం లేదని ఫిర్యాదులు వెల్లు వెత్తుతున్నాయని ఆమె పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎంపీఓడి విజయలక్ష్మి ఆదేశించారు.

## సాగర్ స్కూల్‌ను తెరిపించాలని తల్లిదండ్రుల డిమాండ్

### ఇటీవల ఓ విద్యార్థి పాఠశాల భవనంపై నుండి దూకి మృతి చెందిన ఘటనలో పాఠశాలను సీజ్ చేశారు





**ఉప్పల్, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** ఇటీవల ఉప్పల్ లోని సాగర్ గ్రామర్ స్కూల్ లో జరగకూడని దురదృష్ట సంఘటన జరిగింది. అది ఓ కుటుంబంలో విషాదం నింపింది. తల్లిదండ్రులకు కడుపు కోత మిగిల్చింది. కానీ ఆ ఘటన మూలంగా ఉన్న ఫలంగా స్కూల్‌ను సీజ్ చేయడం వల్ల వందలాది మంది విద్యార్థుల జీవితాలు ఆగమయ్యే పరిస్థితి ఏర్పడింది. వచ్చే నెలలో పదవ తరగతి వార్షిక పరీక్షలు జరగనున్నాయి. ఈ నెల రోజులు విద్యార్థులకు ఎంతో కీలకమైన సమయం. ఏడాది పాటు చదివిన చదువు ఒకెత్తయితే, పరీక్షలకు ఈ సమయం ఎంతో విలువైంది. పదవ తరగతి బోర్డు పరీక్షలు. ఆ స్కూల్ విద్యార్థులకు హాల్ టిక్కెట్లు వచ్చే సమయం. పైగా ఈ నెల రోజులపాటు టీచర్లు ఆ విద్యార్థులను పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయాల్సి వుంటుంది. సిలబస్ ఒక్క అంశమే కాదు పరీక్షలపై విద్యార్థులకు అవగాహన పెంచాల్సిన అవసరం వుంటుంది. ఆ పరీక్షలపై పూర్తి స్థాయిలో విద్యార్థులను తీర్చిదిద్దాల్సి వుంటుంది. ఇలాంటి సమయంలో ఒక సంఘటన దురదృష్టకరమే అయినా మిగతా పిల్లల భవిష్యత్తు కూడా అంతే ముఖ్యం. ఎక్కడ తమ పిల్లల జీవితాలు ఆగమౌతాయని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాదికారి, మండల విద్యాధికారులను వేడుకున్నారు. వెంటనే స్కూల్ తెరవాలని కోరుతున్నారు. ఇలాంటి సమయంలో తమ పిల్లల జీవితాలను ఇబ్బందుల్లోకి నెట్టొద్దని విజ్ఞప్తి చేశారు. సంఘటనపై దర్యాప్తు, ఇతర న్యాయ పరమైన అంశాల పేరు చెప్పి స్కూల్ ను అర్థాంతరంగా మూసేయడం వల్ల ఇతర విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని గుర్తు చేస్తున్నారు. ఉన్నతాధికారుల స్పందించి స్కూల్‌ను తెరిపించకపోతే ఆందోళన చేపట్టాల్సి వుంటుందని పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్చరించారు.

## ఉప్పల్ వీధులలో శివపార్వతుల ఊరేగింపు



**ఉప్పల్, ఫిబ్రవరి 27(నిఘా న్యూస్):** ఉప్పల్ శ్రీ శివశంకర మహామ్మాయి దేవాలయంలో బుధవారం రాత్రి జరిగిన శివపార్వతుల కళ్యాణ మూర్తులను ఉప్పల్ పుర వీదులలో ఊరేగించి, అన్న ప్రసాద వితరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవాలయంలో సభ్యులు ఉప్పోజి బలవంత చారి, బిక్ష పతి, రాజు గోపాల చారి, ఈశ్వర్, శ్రీను, మధు, విజయ్, పల్లెర్ల గోపి, చిరంజీవి, చోల్లేటి పురుషోత్తం, శ్రీధర్, రాజ మల్లేశ్ చారి, మహాంకాళి నరసింహ ముదిరాజ్, శామిర్ పేట హనుమంతు రెడ్డి, బజార్ జగన్నాథ్ గౌడ్, శ్రీనివాస్ రావు, పి.రామేశ్, తీగ విఠల్ రావు, నర్సింగ్ రావు, మామిల్ల బాల్ రాజు, సురేష్, కుమ్మరి నర్సింగ్, శ్రీనివాస్, మల్లేశ్, మహేష్, సంతొష్, సాయి, శివ, ఉపేందర్, గౌతమ్, ప్రశాంత్, నవిన్ గౌడ్, మరియు, శ్రీకాంత్ చారి, పాపయ్య, మల్లేశ్, ముదిగొండ రవి, జంగయ్య, తురాయి దాస్, కృష్ణ, నరసింహ చారి, బాల్ రాజు, కృష్ణ, మొహన్ రెడ్డి, పసుపు నెటి రమేష్, ప్రశాంత్ కుమార్, పవన్ కుమార్, వెంకటేశ్, భవాని శంకర్, సాయిరాం, గౌతమ్ చారి, సంతోష్ కుమార్, అశోక్ గౌడ్ తదితర భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుఅందజేత

**వలిగొండ, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని గోపరాజుపల్లి గ్రామానికి చెందిన నల్లబోలు మచ్చగిరి కి గురువారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు 14 వేల రూపాయల చెక్కును కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సలిగంజి బిక్షపతి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు పూలగూర్ల లింగారెడ్డి కాంగ్రెస్ నాయకులు పాలకూర్ల మత్స్యగిరి పాలకూర్ల మల్లేశం పాలకూర్ల అంజయ్య సలిగంజి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## శివపార్వతుల కళ్యాణంలో కాంగ్రెస్ నేతలు



**హబ్సిగూడ, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** మహాశివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి జరిగిన శ్రీ శివపార్వతుల పార్వతుల కళ్యాణ మహోత్సవంలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ పాల్గొన్నారు. హబ్సిగూడ డివిజన్ లో శ్రీ కోదండరామ శ్రీ రామలింగేశ్వర స్వామి, వెలుగు గుట్ట రామలింగేశ్వర స్వామి, వెంకట్ రెడ్డి నగర్ ఈశ్వర ఫౌండేషన్ లో ఆధ్వర్యంలో నిర్వహించిన శివపార్వతుల కళ్యాణం ప్రత్యేక పూజలలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి,యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ డైరెక్టర్లు, సభ్యులు కాంగ్రెస్ నాయకులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**వలిగొండ, ఫిబ్రవరి 27(నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం మొగిలిపాక గ్రామంలో మచ్చ మైసయ్య అనారోగ్య కారణాలతో మరణించాడని తెలుసుకొని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మామిడి సత్తిరెడ్డి వారి పార్థివదేహానికి నివాళు లర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మొగిలిపాక గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పబ్బు ఎల్లయ్య గౌడ్, పార్టీ నాయకులు ముద్దసాని రఘుపతి రెడ్డి, యాస అంజిరెడ్డి, వెలుసోజు నరేందర్ చారి,మొగిలిపాక పాపయ్య, జడిగే వెంకన్న పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కులాంతర వివాహం చేసుకున్న జంటకు నగదు ప్రోత్సాహం



**నారాయణపేట, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** కులాంతర వివాహము చేసుకున్న జంటకు ప్రభుత్వం ప్రోత్సాహక బహుమతి అందజేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎక్లాస్ పూర్ గ్రామానికి చెందిన నవనీత రాజ్ కుమార్, ఉలిగుండగ్రామానికిచెందిన ప్రియాంక హనుమదాస్ కులాంతర వివాహం చేసుకున్నారు. వారు ప్రభుత్వం అందించే పోత్సాహక బహుమతి కోసం ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకునగా వారికి ప్రోత్సహక బహుమతి మంజూరి కాగా ఒక్కో జంటకు రరెండు లక్షల 50 వేల రుపాయల చొప్పున ప్రోత్సాహక బహుమతి చెక్కులను లబ్దిదారులకు నారాయణ పేట శాసన సభ్యురాలు డా.పర్ణికరెడ్డి అందజేయడం జరిగిందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కజ్జం ఉమాపతి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమంలో డి ఎస్ డి ఓ కార్యాలయ సిబ్బంది పూజారి నర్సింహులు, వసంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### కరీంనగర్ జిల్లాలో..

# ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

**పోలింగ్ స్టేషన్లను సందర్శించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**కరీంనగర్, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** కరీంనగర్ జిల్లాలో మెదక్ నిజామాబాద్ కరీంనగర్ ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు గురువారం నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల అధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేయడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. దీంతో ఎన్నికల నిర్వహణ ప్రశాంతంగా ముగిసింది. 85 గ్రాడ్యుయేట్ పోలింగ్ స్టేషన్లు ,18 టీచర్స్ పోలింగ్ స్టేషన్లలో గ్రాడ్యుయేట్లు ప్రభుత్వ ఉద్యోగులు ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పమేల సత్పతి ఎమ్మెల్సీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించారు. ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా అటు అధికారులు కిందిస్థాయి సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రత్యేక ప్రణాళికను రచించారు జిల్లా కలెక్టర్. ఆ మేరకు ప్రశాంతంగా ఎన్నికలు పూర్తయ్యేలా ప్రత్యేక చొరవ చూపారు. కరీంనగర్ లోని బిఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఎన్నికల సామాగ్రి బ్యాలెట్ బాక్స్ ల స్ట్రాంగ్ రూముల్లో భద్రపరచనున్నారు. ఈ మేరకు పటిష్టమైన భద్రత మధ్య బ్యాలెట్ బాక్స్ లను తరలించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 56మంది, ఉపాధ్యాయ స్థానానికి15 మంది అభ్యర్థులు పోటీ చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్లు 3లక్షల 55 వేల 159 ఉన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 27 వేల 88 మంది ఉన్నారు. అన్ని జిల్లాల్లో కలిపి 499 గ్రాడ్యుయేట్ పోలింగ్ స్టేషన్లు, 274 టీచర్స్ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. 93 కామన్ పోలింగ్ స్టేషన్లు ( గ్రాడ్యుయేట్స్, టీచర్స్) ఏర్పాటు చేశారు. మొత్తంగా అన్ని జిల్లాల్లో 773 పోలింగ్ స్టేషన్ల లో ఎన్నికలు జరిగాయి. జిల్లాలో 36 మంది మైక్రో అబ్జర్వర్లు, 12 మంది సెక్టార్ ఆఫీసర్లు విధులు నిర్వర్తించారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4వరకు పోలింగ్ జరిగింది. పలు ప్రాంతాల్లో నాలుగు గంటల లోపల పోలింగ్ కేంద్రానికి చేరుకున్న వారికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించారు అధికారులు. ఆయా చోట్ల ఆరు ఏడు గంటల వరకు కూడా పోలింగ్ జరిగింది. పోలింగ్ ముగిసిన అనంతరం అన్ని జిల్లాల నుండి బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రత మధ్య కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో గల రిసెప్షన్ సెంటర్‌కు తరలించ నున్నారు. కరీంనగర్ లోని ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ స్టేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. కరీంనగర్లోని డాక్టర్ స్ట్రీట్ లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గల గ్రాడ్యుయేట్ పోలింగ్ స్టేషన్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ స్టేషన్ ను సందర్శించారు. పోలింగ్ సరళిపై ప్రిసైడింగ్ అధికారిని అడిగి తెలుసుకున్నారు.

### ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్

కరీంనగర్‌లోని ముక్రంపురలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన గ్రాడ్యుయేట్ ఎన్నికల పోలింగ్ స్టేషన్ లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి క్యూ లైన్ లో వెళ్లి గ్రాడ్యుయేట్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇదే పోలింగ్ కేంద్రంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తన గ్రాడ్యుయేట్ ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఎమ్మెల్సీ




ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో కలెక్టర్ అధికారులకు, ఎన్నికల సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈనెల మూడో తేదీన సోమవారం ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. కరీంనగర్ లోని బిఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియం ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేపడుతున్నారు. కౌంటింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించడానికి ఇప్పటికే అధికారులకు సిబ్బందికి సూచనలు జారీ చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లు కౌంటింగ్ నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. పటిష్టమైన బందోబస్తు మధ్య ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు జరగనుంది.

## జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పనితీరు పరిశీలన

**పాపులేషన్ రీసెర్చ్ కేంద్రం న్యూఢిల్లీ డాక్టర్ల బృందం**



**వికారాబాద్, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పని తీరుపై పరిశీలించడానికి భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో పాపులేషన్ రీసెర్చ్ కేంద్రం న్యూఢిల్లీ డాక్టర్లు డాక్టర్ రాజేష్, డాక్టర్ సురేష్ కుమార్, బృందం వికారాబాద్ జిల్లా కేంద్రానికి పర్యటించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణతో, జిల్లా ప్రోగ్రామ్ అధికారులతో సమావేశమైన అనంతరం జిల్లా పరిధిలోని చెనగోమ్‌ూల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మన్నెగూడ ఆరోగ్య ఉప కేంద్రం, పరిగి సామాజిక ఆరోగ్య కేంద్రం, దోమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో అమలవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా అసంక్రమిత వ్యాధుల వారికి అందుతున్న వైద్య సేవల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందన్నారు. గర్భవతులకు, మాతా శిశులకు అందుతున్న వైద్య సేవలు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చు కార్యక్రమం ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించడం జరుగుతుందన్నారు. పరిశీలించిన వైద్య సేవల పనితీరును భారత ప్రభుత్వ ఆరోగ్య మంత్రిత్వ శాఖకు నివేదిక రూపంలో సమర్పిస్తామని తెలిపారు. జిల్లా పరిధిలో ఇంకా రెండు రోజులు పర్యటన కొనసాగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రవీందర్ యాదవ్, డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ వై. పవిత్ర, జిల్లా ఆరోగ్య ఉప విస్తరణ అధికారి వి శ్రీనివాసులు, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



మహాశివరాత్రి సందర్భంగా అంబర్ పేట్ మున్సిపల్ కాలనీ లోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో గురువారం బిఆర్ఎస్ నాయకుడు రంగు సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో శివ పార్వతుల కళ్యాణం కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో అంబర్ పేట్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎం. సిద్ధార్థ్ ముదిరాజ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు, పార్టీ సీనియర్ నాయకుడు కారింగుల లింగారావు, నజయ్ ముదిరాజ్, మహేష్ గౌడ్, నరేంద్ర ముదిరాజ్, దశరథ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

**- అంబర్‌పేట, ఫిబ్రవరి 27(నిఘా న్యూస్):**

## కోటి రూపాయలతో... విశాఖ ఎంవీపీ సెంట్రల్ నర్సరీ



**విశాఖపట్నం, ఫిబ్రవరి 27(నిఘా న్యూస్):** సుమారు కోటి రూపాయల వ్యయంతో చేపడుతున్న ఎంవీపీ సెంట్రల్ నర్సరీ అభివృద్ధి పనులను విశాఖ విఎంఆర్‌డిఏ కమిషనర్ విశ్వనాథన్ గురువారం పర్యటించారు. రహదారి ఆఫీసు భవనం పంప్ హౌస్ నిర్మాణాల ఆకృతులలో స్వల్ప మార్పులను చేర్పులను సూచించారు. అదేవిధంగా నిర్మాణ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారు తో పాటు అధికారులను ఆదేశించారు.

## రేవంత్ పాలనలో ఇందిరమ్మ కాలం నాటి నియంతృత్వం

**తెలంగాణ సహకార యూనియన్ మాజీ చైర్మన్ రాజా వర ప్రసాద్**



**షాద్‌నగర్, ఫిబ్రవరి 27(నిఘా న్యూస్):** మేడిగడ్డ బ్యారేజీలోని ఒక పిల్లర్ చూడటానికి వెళ్లిన రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీలను తాము అడ్డుకోలేదని కానీ, రేవంత్ రెడ్డి పాలనలో ఇందిరమ్మ కాలం నాటి నియంతృత్వ పాలనను మళ్లీ చూస్తున్నామని తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ మాజీ చైర్మన్ రాజా వరప్రసాద్ ఆరోపించారు. మాజీ నీటిపారుదల శాఖ మంత్రి ఏడుసార్లు ఎమ్మెల్యేగా రాష్ట్రస్థాయి నాయకుడిగా ఎంతో అనుభవం ఉన్న హరీష్ రావు ను పోలీసులు నాగర్ కర్నూల్ వద్ద అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాద ఘటనను పరిశీలించడానికి వెళ్తున్న హరీష్ రావును ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి అడ్డుకోవడం తగదన్నారు. రక్షణ బృందాలు సమన్వయం సాధించడంలో ప్రభుత్వం విలఫమైందని టన్నెల్‌లోకి వెళ్లేందుకు హరీష్ రావు తదితరులకు అనుమతి ఇవ్వలేదన్నారు. సహాయ చర్యలకు ఇబ్బంది అవుతుందని ఇన్ని రోజులు ఎవరు రాలేదనీ ప్రజాప్రతినిధులు మంత్రిని కలవకూడదా. ప్రమాదానికి సంబంధించిన విషయాల గురించి మాట్లాడకూడదా. ఇదెక్కడి ప్రజా పాలన అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రాజా వరప్రసాద్ నిలదీశారు. ఆరు రోజుల తర్వాత తీసింది కేవలం తట్టెడు మట్టి మాత్రమే అనీ 8 మంది ప్రాణాలు కాపాడటం పట్ల ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఇదేనా కాంగ్రెస్ సర్కార్ అవినీతి, నిర్లక్ష్యంతో 15 నెలల్లోనే 4 ప్రాజెక్టులు కూలిపోయినయ్ అని తెలిపారు. ప్రమాద ఘటనలో చిక్కుకున్న 8 మంది కార్మికుల ప్రాణాలు కాపాడే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరు రోజులైనా ఇప్పటి వరకు సరైన డైరెక్షన్ లేదని విమర్శించారు.

### ఖాళీ చేసిన... డంపింగ్ యార్డ్ స్థలంలో

# కమ్యూనిటీ హాల్‌ను నిర్మించండి



**● ప్రజా ప్రతినిధులు జిహెచ్ఎంసి ఉన్నతాధికారులకు స్థానికుల వినతి**

**అంబర్‌పేట, ఫిబ్రవరి 27(నిఘా న్యూస్):** బాగ్అంబర్‌పేట్ డివిజన్ బతుకమ్మ కుంటలోని జిహెచ్ఎంసి డంపింగ్ యార్డ్ స్థలంలో స్థానిక ప్రజల సౌకర్యార్థం అధునాతన కమ్యూనిటీ హాల్ (సామాజిక భవనం)ను నిర్మించాలని డిమాండ్ సర్వత్ర వెల్లువెత్తుతుంది. ప్రస్తుతం బతుకమ్మ కుంట పరిసరాల్లో కమ్యూనిటీ హాల్ లేకపోవడంతో స్థానిక ప్రజలు చిన్న చిన్న కార్యక్రమాలు చేసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బతుకమ్మ కుంటలో జిహెచ్ఎంసి ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్ స్థలం(300 చదరపు గజాలు) ప్రస్తుతం ఖాళీగా ఉంది. జనవాసాలు నడుమ ఉన్న డంపింగ్ యార్డ్ ను తరలించాలని స్థానికుల నుంచి తీవ్ర వత్తిడి రావడంతో జిహెచ్ఎంసి దానిని ఇక్కడి నుంచి తరలించింది. ప్రస్తుతం ఖాళీగా ఉన్న విశాలమైన స్థలంలో కమ్యూనిటీ హాల్ ను నిర్మించాలని స్థానిక కాలనీవాసులు న్యాయవాది శ్రీహరి, శేఖర్, రమేష్ ముదిరాజ్ లు ప్రజా ప్రతినిధులకు, జిహెచ్ఎంసి ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. గతంలో ఈ ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం నిధులు మంజూరైన స్థలం లేకపోవడంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టలేదని వారు గుర్తు చేశారు. ఈ ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ లేకపోవడంతో స్థానిక ప్రజలు చిన్నచిన్న శుభకార్యాలు చేసుకోవడానికి, బస్తీ సమావేశాలు నిర్వహించుకోవడానికి, మహిళలకు కుట్టు శిక్షణ తదితర వాటి కోసం ఇబ్బందులు పడాల్సి వస్తుందని వారు తెలిపారు. ఇక్కడ కమ్యూనిటీ హాల్ లేకపోవడంతో ప్రజలు చిన్న శుభకార్యానికి డబ్బులు చెల్లించి ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లను ఆశ్రయించాల్సి వస్తుందని వారు అంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు స్పందించి బతుకమ్మ కుంటలోని డంపింగ్ యార్డ్ స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మించే దిశగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## ఎల్లంపేటలో శివాలయం వార్షికోత్సవ వేడుకలు



**మేడ్చల్, ఫిబ్రవరి 27(నిఘా న్యూస్):** మేడ్చల్ మండలం ఎల్లంపేట్ గ్రామంలో శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి మరకత శివలింగం శివాలయం ఐదవ వార్షికోత్సవం వేడుకలు, శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, శివపార్వతి దేవత మూర్తుల ఉత్సహ విగ్రహాలు ఊరేగింపు, కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించడం జరిగింది. ఈ పూజ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గౌరయ్య గారి శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ రేణుకా దేవి జగన్ గౌడ్, వెన్నల రామకృష్ణుడు, తలారి నరసింహ, మాజీ ఎంపీటీసీ కుమార్ యాదవ్, మాజీ ఉప సర్పంచ్ గణేష్, మహేష్ తుడుం రాజు, శ్రీనివాస్ ముదిరాజ్,మారుతీ, రాజు, హరిప్రసాద్ గౌడ్, లక్ష్మి ప్రసాద్ గౌడ్, తలారి చందర్, నర్సింగ్ రావ్,రాజి రెడ్డి,మైపాల్ రెడ్డి, ఎల్లం, లోకేష్, స్వామి, శ్రీశైలం, నాగరాజు గౌడ్, సంతోష్ వర్మ,భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



## ఈదమ్మ గుడిలో స్వామి వారి కళ్యాణం



**ఉప్పల్, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** శ్రీ అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వర ఆలయం ఉప్పల్ సర్వే ఆఫ్ ఇండియా ఈదమ్మ గుడి ప్రాంగణం స్వామి వారి కళ్యాణం భక్తుల కోలహాల మధ్య బుధవారం రాత్రి వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖులు స్థానికులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని కళ్యాణ మహోత్సవాన్ని విజయ వంతం చేశారు. ఆలయాన్ని స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చాడ వాణిశ్రీ అనూప్ కుమార్ దంపతులు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించగా, ప్రధాన అర్చకులు సిద్దేశ్వర శర్మ ఆధ్వర్యంలో స్వామివారి కళ్యాణం వైభోగంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చర్ల సుధాకర్ రెడ్డి గుడి చైర్మన్ మేకల దయాసాగర్ రెడ్డి భక్తులు సర్వే ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ గోపాలకృష్ణ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## కీసర గుట్టలో వాసవి నిత్య అన్నదానం



**కీసర ఫిబ్రవరి 27వ (నిఘా న్యూస్)** కీసర గుట్టలో మహాశివరాత్రి సందర్భంగా వాసవి నిత్య అన్నదానం కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రతి సంవత్సరం మహాశివరాత్రి సందర్భంగా నిత్య అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందని, అన్నదాన కార్యక్రమంలో దూరం నుండి వచ్చే ప్రజలు కాకుండా ఉద్యోగరీత్యా పని చేస్తే పోలీస్ శాఖ ఇతర మున్సిపల్ సిబ్బంది పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నదాన ప్రసాదములు స్వీకరిస్తారని వాసవి నిత్య అన్నదాన నిర్వాహకులు తెలిపారు. మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు జాతర జరిగిన ఆరు రోజులపాటు పొద్దున టిఫిన్ మధ్యాహ్నం భోజనం సాయంకాలం అన్నదాన ప్రసాదములు ఏర్పాటు చేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున దాతలు ఇచ్చే విరాళములను అన్నదాన వితరణ కోసమే ఉపయోగిస్తామని తెలిపారు. ఈ పుణ్య కార్యక్రమంకు ఎవరైనా వారికి తోచిన సహాయ సహకారాలు ఇవ్వవచ్చు అని తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఆహార కొరత ఉండొద్దన్న దృఢ సంకల్పంతో మేము నిత్య అన్నదాన కార్యక్రమం చేయడం జరుగుతుందని వాసవి నిత్య అన్నదాన సత్రం అన్ని విధాల ఏర్పాట్లకు ముందుంటుందని అన్నారు.

## మా ఫౌండేషన్‌లో అన్నదానం

### ఘనంగా కార్తికేయన్ వర్మ జన్మదిన వేడుకలు



**మేడిపల్లి, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం చైల్డ్ లైన్ ప్రొటెక్షన్ ఫోరమ్ వ్యవస్థాపక అధ్యక్షులు మహాదేవ్ ప్రసాద్ రాజు కుమారుడు కార్తికేయన్ జన్మదిన వేడుకలు అనాథ పిల్లల మధ్యలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కార్తికేయన్ వర్మ. ఈ సంవత్సరం చాలా అనుబంధంతో కూడుకుందని దానికి కారణం అనాథ పిల్లల మధ్యలో కేక్ కట్ చేసుకోవడం సంతృప్తినిచ్చిందని అన్నారు. ఈ జన్మదిన వేడుకలో మహాదేవ్ లోహిత్ రాజ్, మా ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అశ్వారావుపేటలో ప్రశాంతంగా ముగిసిన పట్టభద్రుల ఎన్నికలు



**అశ్వారావుపేట, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** అశ్వారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. పోలింగ్ కేంద్రం పీఎస్ నెం. 80లో మొత్తం 47 మంది ఓటర్లకు గానూ 44 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 20 మంది పురుషులు, 24 మంది మహిళలు ఉండగా, 91.48 శాతం పోలింగ్ నమోదైంది. ఓటింగ్ సజావుగా సాగేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు అదనపు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ పూర్తయ్యాక, బ్యాలెట్ బాక్సులను భద్రతతో స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు.

# తిరుమలలో తిష్టవేసిన అధికారుల అవినీతి



### తిరుమలలో ప్రక్షాళన చేపట్టండి

### టీటీడీ చైర్మన్ ను కలిసిన తిరుమల పరిరక్షణ సైన్యం

**తిరుమల, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** తిరుమల కొండపై స్థానికులను పట్టించుకోకుండా రాజకీయ ఒత్తిడితో స్థానికేతరులను చేరదీయడం కారణంగా తట్టల పేరుతో ఆక్రమణలు, అసాంఘిక శక్తులు పెరిగిపోయి పవిత్రత, ప్రశాంతత దెబ్బతింటోందని, వెంటనే తిరుమలలో ప్రక్షాళన మొదలు పెట్టాల్సిన అవసరం ఉందని తిరుమల పరిరక్షణ సైన్యం ప్రతినిధులు టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు బి.ఆర్ నాయుడుకు విజ్ఞప్తి చేశారు. గురువారం తిరుమలలో టిటిడి చైర్మన్ ను కలిసిన తిరుమల పరిరక్షణ సైన్యం ప్రతినిధులు కోలా లక్ష్మీపతి,వి కృష్ణ, పి వాసుదేవన్, కే.హరి ప్రసాద్, వేలు, ముని వెంకటయ్య తదితరులు ఆయనతో సమావేశమై తిరుమలలో నెలకొన్న ఇబ్బందికర పరిస్థితులపై చర్చించారు. అనంతరం తిరుమలలో ప్రక్షాళన చేపట్టాలని వినతి పత్రం అందించారు. తిరుమల శ్రీవారి ఆలయ అభివృద్ధి కోసం స్థలాలు అప్పగించి ఎన్నో త్యాగాలు చేసిన స్థానికులను ప్రస్తుతం టీటీడీ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమల కొండపై స్థానికులకు మాత్రమే జీవనోపాధి కల్పించాల్సిన టిటిడి స్థానికేతరులను ప్రోత్సహించిన కారణంగా అసాంఘిక శక్తులు కొండపై తిష్ట వేశాయని చెప్పారు. ముఖ్యమంత్రి చెప్పిన విధంగా తిరుమల కొండపై ప్రక్షాళన మొదలు పెట్టాల్సిన అవసరం ఉందని, తొలుతగా ఏళ్ల తరబడి తిరుమల కొండపై తిష్ట వేసిన అధికారులను ఉద్యోగులను బదిలీ చేసి అనుభవజ్ఞులైన సేవా దృక్పథం కలిగిన వారిని నియమించాలన్నారు. అలాగే కొండపై 1200 షాపులు,720 హాకర్ లైసెన్సులను మాత్రమే టీటీడీ అనుమతి ఇచ్చి ఉందని,వాటికి టెనెంట్ నెంబర్ కూడా ఉన్నాయని, వీటిని మాత్రమే పరిగణలోకి తీసుకొని మిగిలిన అనధికారిక హాకరులను, తట్టలను తొలగించే విధంగా టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. టీటీడీ చేపట్టే ప్రక్షాళనకు తిరుమల పరిరక్షణ సైన్యం అండగా ఉంటుందని పూర్తి సహకారం అందిస్తామని వెల్లడించారు. దీనిపై చైర్మన్ బి ఆర్ నాయుడు సానుకూలంగా స్పందిస్తూ తప్పనిసరిగా టిటిడిలో ప్రక్షాళన మొదలుపెట్టడం ఖాయమని,ఏళ్ల తరబడి తిరుమల కొండపై తిష్టవేసిన కొంతమంది ఉద్యోగుల కారణంగా ఇటీవల సమస్యలు కూడా అధికమయ్యాయని అన్ని సమస్యలపై ఇప్పటికే ఒక అవగాహనతో కార్యాచరణతో ముందుకు వెళతామన్నారు. పంచాయతీ రెవెన్యూ విభాగంలో ఇంతకాలం ఉన్న అవినీతి అధికారి కారణంగా తిరుమల కొండపై ఇష్టానుసారంగా ఆక్రమణలు వెలిశాయని గుర్తించామన్నారులైసెన్సులు లేని హాకరులను తొలగించి రాజకీయ ఒత్తిడి లను పట్టించుకోకుండా తిరుమల పవిత్రతకు ప్రశాంతతకు విజిలెన్స్ విభాగం ప్రక్షాళనకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటామని చైర్మన్ వెల్లడించారు.

# షామీర్పేటలో శివ పార్వతుల కళ్యాణం



**శామీర్‌పేట, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** మహాశివరాత్రి పురస్కరించుకొని వివిధ గ్రామాలలో శివ పార్వతుల కళ్యాణం అంగరంగవైభోగంగా నిర్వహించారు. బుధవారం రాత్రి ఉమ్మడి శామీర్ పేట మండలం లోని పలు గ్రామాలలో శివపార్వతుల కళ్యాణం భక్తుల కోలాహలం మధ్య కన్నుల పండుగగా జరిపారు. మండల కేంద్రం శామీర్ పేట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రధానర్చకులు గడియారం మురళీ ధరశర్మ ఆధ్వర్యంలో భక్తుల కోలాహలంతో శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి కళ్యాణం ఎంతో ఆనందోత్సవాలతో నిర్వహించారు. మధ్య రాత్రి లింగోద్భవ కాలంలో స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం జరిపారు. జాగరణలో భాగంగా జవహర్ నగర్ కు చెందిన హరిహార భక్త భజనమండలి ఆధ్వర్యంలో సదాచారి భజనలు చేయగా భక్తులు జాగరణ చేస్తు ఉత్సాహంగా పాల్గొన్నారు. గురువారం తెల్లవారు జామున స్వామివారికి మంగళహారతి, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వితరణ చేశారు. అలాగే శామీర్ పేట శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో స్వామివారి కళ్యాణం నిర్వహించారు. అలాగే తూంకుంటలోని శ్రీ గాయత్రి మహాక్షేత్రంలో ఆలయ వ్యవస్థాపకులు, శిష్య జనోద్ధారక డాక్టర్ ఎస్వీఎల్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో ఉమామహేశ్వర స్వామి కళ్యాణం జరిపారు. మూడు చింతలపల్లి మండలం ఉద్దమర్రి శ్రీ విష్ణు శివాలయంలో స్వామివారి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని శివపార్వతులకు ఓడి బియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



# అశ్వారావుపేటలో మైక్రో ఫైనాన్స్ ఏజెంట్ల అరాచకం

• ఇంట్లోకి ప్రవేశించి కుర్చీతో దాడికి యత్నం • తోపులాటలో కుటుంబ సభ్యులకు గాయాలు • పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు



**అశ్వారావుపేట, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** అశ్వారావుపేట పట్టణంలో జంగారెడ్డిగూడెంకు చెందిన స్పందన మైక్రోఫైనాన్స్ ఏజెంట్లు అరాచకం సృష్టించి కుర్చీలతో దాడికి ప్రయత్నించారని అశ్వారావుపేట పట్టణానికి చెందిన మహమ్మద్ మౌలాన్ బి వాపోయారు. జంగారెడ్డిగూడెం కు చెందిన స్పందన మైక్రో ఫైనాన్స్ వద్ద రెండు దఫాలుగా 80 వేలు లోను తీసుకోవడం జరిగిందని, ప్రతినెలా వాయిదాలను చెల్లిస్తూ ఇప్పటికి 18 వాయిదాలు చెల్లించామని, మార్చి నెల రావడంతో ఇన్కమ్ టాక్స్ చెల్లించడంతో, ఈనెల వాయిదా చెల్లించలేకపోయామని, కొంత గడువు కావాలని కోరడం జరిగిందని, అయినా స్పందన మైక్రో ఫైనాన్స్ కు చెందిన ఏజెంట్లు దిలీప్, అయ్యప్ప లు మా ఇంటి పైకి వచ్చి నోటికి వచ్చినట్లుగా దుర్భాషలాడుతూ మర్యాద లేకుండా మాట్లాడి మమ్ములను అగౌరవపరచడమే కాకుండా మా ఇంటి వద్ద ఉన్న కుర్చీతో నా భర్త మహమ్మద్ హుస్సేన్ పై దాడి చేయడానికి ప్రయత్నించారని, ఈ ప్రయత్నంలో మా కుర్చీలు సామాన్లు పగిలిపోయాయని, ఎంత వారించినా వినకుండా మమ్మల్ని ఇబ్బందులకు గురి చేశారని కుటుంబ సభ్యులు మీడియా ముందు వాపోయారు. వెంటనే పోలీస్ సహాయం కోసం 100 నెంబర్ కు డయల్ చేశామని, పోలీసులు కూడా సరైన సమయానికి రాకుండా వచ్చేవరకు వీడియో తీసి ఉంచాలని సలహా చెప్పటం ఎంతవరకు సబబని వారు ప్రశ్నించారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని దుర్భాషలాడి దాడికి ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు మీడియా ద్వారా పోలీసు అధికారులను కోరారు.



## రామలింగేశ్వర స్వామి ఆలయంలో అన్నదానం

**శామీర్‌పేట, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వాహకులు పెద్ద ఎత్తున అన్నదానాలు చేపట్టారు. గురువారం ఉమ్మడి శామీర్ పేట మండలంలోని దగ్గర గ్రామాలలో అన్నదానం చేపట్టారు. మండల కేంద్రం శామీర్ పేట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయం అలాగే శ్రీ వీరభద్ర స్వామి ఆలయం వద్ద భక్తుల సహకారంతో అన్నదానం చేపట్టారు. శామీర్ పేట మండలంలో అలియబాద్, లాల్ గడి మలక్ పేట గ్రామంలో నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు. మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామంలో అన్నదానం చేపట్టగా ఆయా గ్రామాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

## పోలింగ్ సరళిని పరిశీలించిన డిసిసి కార్యదర్శి



**నిజాంపేట్, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** సంగారెడ్డి జిల్లా గురువారం పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ జరుగుతున్న తీరును పర్యవేక్షించి నాయకులతో కలిసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ మండల అధ్యక్షులు శంకర్ గౌడ్ ప్యాక్స్ చైర్మన్ రవి లింగారెడ్డి రఘుపతి రెడ్డి జలా శంకర్ పండుగు కిష్టయ్య మన్నే కృష్ణ కాలే చరణ్

## వికాస భారతి ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** మాన్య స్పోర్ట్స్, కల్చరల్ అకాడమీ(ఏ డివిజన్ ఆఫ్ వికాస భారతి చారిటబుల్ ట్రస్ట్) మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కేబిఆర్ పార్క్ లో గల వినాయకుని వద్ద పూజలు నిర్వహించినట్లు వికాస భారతి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ రామగోపాల్ రెడ్డి, ప్రమోద్ సాన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి డా.బీరంగుల ఉదయ్ కిరణ్ జాతీయ బీసీ దళ్ అధ్యక్షులు, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి, మాజీ మంత్రి ఎంవి.మైసూరా రెడ్డి, పారిశ్రామికవేత్తలు రాజేంద్ర అగర్వాల్, సురేందర్ అగర్వాల్, స్కేటింగ్ దినేష్ పంచల్, ఫుట్బాల్ కోచ్ మల్లికార్జున్ గౌడ్, మ్యూజిక్ డైరెక్టర్ ప్రణయ్ కుమార్, ఇందిరా నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## శివ పూజల పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



**మేడ్చల్, ఫిబ్రవరి 27(నిఘా న్యూస్):** మేడ్చల్ పట్టణంలోని ఒలివ్ పాఠశాలలో గురువారం నిర్వహించిన మహా శివ పూజలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి నిర్వహించిన అభిషేక కార్యక్రమంలో పాల్గొని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం నిర్వాహకులు అతిథులను శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి,మేడ్చల్ జిల్లా ఇంచార్జ్ హరివర్ధన్ రెడ్డి,మార్కెట్ డైరెక్టర్ దుర్గం శివ శంకర్,మాజీ మార్కెట్ ఛైర్మెన్ సత్యనారాయణ, సంతోష్ గౌడ్,శ్రీనివాస్ రెడ్డి,రమణ రెడ్డి,మాజీ కౌన్సిలర్ కొడే మహేష్ , జాకట దేవ, సీనియర్ నాయకులు శేఖర్ గౌడ్,రాజశేఖర్ రెడ్డి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



**ముస్తాబాద్, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన ఓల్లెపు దేవరాజు అనే వ్యక్తి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం ఓ వ్యక్తికి చెందిన వ్యవసాయ బావిలో పూడికతీత పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు ఓల్లెపు దేవరాజుకు విద్యుత్ షాక్ వచ్చిందని తెలిపారు. బంధువులు హుటాహుటిన స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. మృతునికి భార్య లలిత, ఇద్దరు కుమారులు ఉన్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.




నియోజకవర్గంలోని ధర్మారం మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రంలో నంది మేడారం జూనియర్ సివిల్ కోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆకారి రాజేశం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

– ధర్మపురి, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):

## ఇల్లందులో శివపార్వతుల కళ్యాణం

### మహా అన్నదాన ప్రసాదం





**ఇల్లందు, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** ఇల్లందు పట్టణంలోని స్థానిక 18 వ వార్డు గాంధీ చౌక్ సమీపంలో గల శ్రీ ఉమా గణపతి శివాలయంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని. బుధవారం రాత్రి 12 గంటలకు శివపార్వతుల కళ్యాణం ఘనంగా నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా గురువారం ఆలయంలో ఉదయం ఐదు గంటల నుండి ప్రత్యేక పూజ కార్యక్రమాలు, రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతం.అనంతరం మహా అన్నదాన ప్రసాద కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు యెలుగూరి మధుబాబు, చందా చక్రధర్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాలు నుండి శ్రీ ఉమా గణపతి శివాలయంలో శివ కళ్యాణాన్ని ఘనంగా నిర్వహిస్తున్నమన్నారు. మహా అన్న ప్రసాద కార్యక్రమంలో సుమారు మూడు వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గందె సురేష్, రామిడి శంకర్, నూక ఆనందరావు, సుగ్గల మహేష్,కె. భాస్కర్, సుబ్బారావు, యెలుగూరి మనోజ్, ముఖ్య అతిధులు ఆర్యవైశ్య మహాసభ సభ్యులు ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, అర్వపల్లి రాధాకృష్ణ, నరేంద్రుల అను, కందె రమేష్, వ్యామసాని జనార్ధన్ రావు,యెలుగూరి నగేష్ కుమార్, సైఫా రాజశేఖర్, తాటిపల్లి సుబ్బారావు, పుల్లూరు సతీష్, భోనగిరి రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సక్సెస్ స్టార్ స్కూల్ వార్షికోత్సవం

### విద్య నేర్చుకుంటనే బంగారు భవిష్యత్తు

### రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ తారీఖ్ అన్సారీ




**పహాడీషరీఫ్, ఫిబ్రవరి 27(నిఘా న్యూస్):** విద్యార్థులు క్రమశిక్షణతో ఉండి ఉపాధ్యాయులు చెప్పిన దాన్ని విని నేర్చుకుంటేనే భవిష్యత్తులో బంగారు భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ తారీఖ్ అన్సారీ అన్నారు. జల్పల్లి మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపేట సక్సెస్ స్టార్ స్కూల్ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తారీఖ్ అన్సారీ మాట్లాడుతూ విద్యనభ్యసించడం ద్వారానే సమాజంలో అన్ని రకాలుగా గౌరవం లభిస్తుందన్నారు. విద్యార్థుల సృజనాత్మకత కలిగి ఉండాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పినదాన్ని విద్యార్థులు తూచా తప్పకుండా పాటించాలన్నారు. విద్యార్థులకు పాఠాలే కాకుండా మన సంస్కృతి సంప్రదాయాల పట్ల అవగాహన కలిగించాలన్నారు. సాంస్కృత కార్యక్రమాలలో ఆటలలో, పాటలతో అన్నింటిలో చురుకుగా పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ బాడీ బిల్డర్ మీర్ మోతే షాం అలీ ఖాన్, పాఠశాల డైరెక్టర్ మహ్మద్ షుజా వుద్దీన్, కరస్పాండెంట్ అతియా ఫాతీమా తదితరులు పాల్గొన్నారు.

## దేవుని కుక్కకు పార్కులోనే దహన క్రియలు

**తిరుపతి, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** స్థానిక మున్సిపల్ పార్కులో నివసిస్తూ ఉండేటువంటి కుక్క విఐపి మహాశివరాత్రి జాగారం సందర్భంగా మహాశివుని విగ్రహం వెనకాల మరణించి ఉండడంతో గమనించిన మున్సిపల్ పార్కు వాకర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వి జగన్నాథం అక్కడ పనిచేసే వర్కర్స్ తో కలిసి దేవుని కుక్క కు దహన క్రియలు జరిపించామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుడు కుక్క మున్సిపల్ పార్కులోనే శివుడు చుట్టూ గత 15 సంవత్సరాలుగా నివసిస్తుంది .కానీ ఎవరి జోలికి పోదు అయినా శివుడు చుట్టూనే రాత్రి పగలు పడుకుంటది. ముఖ్యంగా ఇది శివుడి దగ్గరే మహాశివరాత్రి సందర్భంగా రాత్రి జాగారం చేస్తూ చనిపోయినది.



# ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం

- టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి 92. 57 శాతం,
- పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 73. 19 శాతం
- జిల్లా ఎన్నికల అధికారి / కలెక్టర్ క్రాంతి వల్లూరు






**సంగారెడ్డి, ఫిబ్రవరి 27(నిఘా న్యూస్):** ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయని జిల్లా ఎన్నికల అధికారి / కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని తార డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ లు ,పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలను, అందోల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయలు, పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ క్రాంతి వల్లూరు పరిశీలించారు. జిల్లాలో పట్టబద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు కోసం 68పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ప్రక్రియ నిర్వహించడం జరిగిందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు జిల్లాలో 25652 మంది ఓటర్లు ఉండగా 18774 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి జిల్లాలో 2690 మంది ఓటర్లు ఉండగా 2490 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 8గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ ఉదయం 10గంటలవరకు టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి 12. 94 శాతం , పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 8. 05 శాతం , మధ్యాన్నం 12 గంటలకు టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి 39. 93 శాతం, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 24. 60 శాతం, మధ్యాన్నం 2 గంటలకు టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి 68. 25 శాతం, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 45. 88 శాతం, సాయంత్రము 4.00 గంటల వరకు టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి 85. 69 శాతం, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 66. 47 శాతం, పోలింగ్ ముగిసేసమయానికి టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి 92. 57 శాతం, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 73. 19 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ ముగిసే సమయానికి ముందే పోలింగ్ బూత్ లో ఉన్న ఆఖరి ఓటరు వరకు ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఇవ్వడం జరిగిందని తెలిపారు.అదనపు కలెక్టర్ మాధురి పఠాన్ చెరు మండలంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. జిల్లాలోని జహీరాబాద్ ఆర్డిఓ రాంరెడ్డి ,నారాయణఖేడ్ ఆర్డి అశోక్ రెడ్డి, అందోల్ ఆర్డీవో పాండు, సంగారెడ్డి ఆర్డిఓ రవీందర్ రెడ్డిలు ఆయా డివిజన్ల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు. పోలింగ్ ముగిసిన తర్వాత నిర్దేశించిన రూట్ మ్యాప్ ద్వారా బ్యాలెట్ బాక్స్ లను భారీ పోలీసు బందోబస్తు నడుమ కరీంనగర్లో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్ కు తరలించడం జరిగిందని ఆమె తెలిపారు.

## శ్రీలక్ష్మీ నరసింహ స్వామి

# అఖండ జ్యోతికి ఘన స్వాగతం



**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 27(నిఘా న్యూస్):** శ్రీ లక్ష్మీనరసింహ స్వామి అఖండ జ్యోతికి స్వాగతం పలికిన ఘట్కేసర్ వాసులు. యాదాగిరి గుట్ట శ్రీ లక్ష్మి నర్సింహ్మ స్వామి వారి 31వ అఖండ జ్యోతి యాత్ర గురువారం సాయంత్రం ఘట్ కేసర్ చేరుకుంది. మహా శివరాత్రి పర్వదినాన నగరంలోని యాదగిరి భవన్ నుండి ప్రారంభమైన శ్రీ లక్ష్మీనర్సింహ్మ స్వామి అఖండ యాత్ర ఘట్ కేసర్ చేరుకోవటంతో స్థానిక నాయకులు, భక్తులు ఘనంగా స్వాగతం పలికి మంగళ నీరాజనాలను అర్పించారు. 12అడుగుల ఎత్తుతో శ్రీ స్వామి వారు అమ్మవారల ప్రతిమలతో దేదీప్యమానమైన దీపకాంతులతో సుర్వాంగ సుందరంగా ఆలంకరింపబడిన దివ్య పుష్ప రథంపై వచ్చిన స్వామి వారికి ఘనంగా పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఘట్ కేసర్ ఇన్ స్పెక్టర్ పరశురాం, ఎస్సై ప్రభాకర్ రెడ్డి, భువనగిరి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఆల్వ మోహన్ రెడ్డి, మండల మాజీ రైతు బంధు సమితి అధ్యక్షుడు కొంతం అంజిరెడ్డి, రైతు సేవా సహకార సంఘం డైరెక్టర్ రేసు లక్మారెడ్డి, మాజీ డైరెక్టర్ బొక్క ప్రభాకర్ రెడ్డి, నాయకులు కొమ్మిడి మహిపాల్ రెడ్డి, ముత్యాలు యాదవ్, దేవేందర్ ముదిరాజ్, పల్లె విజయ్ తదితరులు పాల్గొన్నారు.




నిరుపేదలకు సొంత ఇంటి కల నిజం చేసే దిశగా ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక సరఫరా చేసే టీజీఎండిసి సబ్ స్టాప్ యార్డ్ ద్వారా జరపడానికి బౌరంపేట నందు సర్వేనెంబర్ **166** లోని సుమారు **13** ఎకరాల స్థలాన్ని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తో కలిసి స్టేట్ ఫ్లాగ్ షిప్ స్కీమ్స్ కమిషనర్ శశాంక స్థలాన్ని గురువారం గుర్తించారు. ఈ కార్యక్రమంలో గనులు భూగర్భ శాఖ డైరెక్టర్ టి జి ఎం డి సి సుశీల్ కుమార్ స్థానిక రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

– శామీర్‌పేట, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):

## డా.రాజ్ నారాయణకు టీఎన్జీవోల సన్మానం




**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** సమాజ సేవలో డా.రాజ్ నారాయణ ముదిరాజ్ చేస్తున్న సేవలు అమోఘం అని టీఎన్జీవోస్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు జగదీశ్వర్ అన్నారు. ప్రపంచ స్వచ్ఛంద సేవా సంస్థ దినోత్సవం సందర్భంగా గురువారం నాంపల్లిలోని టీఎన్జీవో సెంట్రల్ ఆఫీసులో డా.రాజ్ నారాయణ ముదిరాజ్ సన్మాన సభలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. అనంతరం శాలువా పూలమాల జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. గత 40 సం.లుగా ప్రముఖ స్వచ్ఛంద సేవ సంస్థ అయిన తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ సంస్థను స్థాపించి 1985 నుంచి 2025 వరకు నిర్విరామంగా 40 సంవత్సరాలుగా సేవలందిస్తున్నందుకు ఆయన సేవలను గుర్తించి ఈ సన్మానం చేశామని అన్నారు.

## ఆదివాసీ కుటుంబాలకు నిత్యావసరాలు అందజేత

### సుధా హెర్బల్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చేయూత

### డాక్టర్ కొనకళ్ల సుధారాణి ఆపన్న హస్తం





**అశ్వారావుపేట, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** హెర్బల్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ కొనకళ్ల సుధారాణి ఆదివాసీ 20 కుటుంబాలకు నిత్యావసరాలు పండ్లు,బిస్కెట్స్ వితరణగా అందించారు. ఆ తర్వాత వారితో మాట్లాడారు.సుధా హెర్బల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తాను ఈ వితరణ కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఆమె వివరించారు. అశ్వారావుపేట మండలం గుంటిమడుగు దగ్గర రమణక్కపేట కాలనీలో ఆదివాసీలు పోషకాహారం పేదరికం వల్ల పోషకాహార లోపంతో బాధపడుతున్నారు అని తెలుసుకుని వారికి ఈ సహాయం చేసినట్లు ఆమె తెలిపారు.ఆదివాసి ప్రజలు ఇబ్బంది పడటం, అనారోగ్యానికి గురి కావటం తనను కలచి వేసిందనని అన్నారు. అందుకే గురువారం నేరుగా ఆదివాసీలు ఉంటున్న ప్రాంతానికి ఉదయం 5:30కి అక్కడకు చేరుకొని వారికి సహాయాన్ని అందించానని అన్నారు. అనంతరం ఆదివాసీలకు ఆరోగ్య సూచనలు చేశారు.

## వైభవంగా శివపార్వతుల కళ్యాణం



**చంద్రగిరిద, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కందుల వారి పల్లి పంచాయతీ నారావారిపల్లి సమీపంలో ఉన్న టీటీడీ అనుబంధ దేవాలయమైన శ్రీ శేషాచల లింగేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కళ్యాణం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. గురువారం తెల్లవారుజామున లింగోద్భవ దర్శనం భక్తులకు కల్పించారు. అనంతరం సాయంత్రం 10 గంటలకు ఆలయ ఆవరణంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పీఠంపై వివిధ రకాల అభిషేకాలు నిర్వహించి,పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, వివిధ పుష్పాలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల గ్రామాలలోని భక్తులు విశేషంగా పాల్గొన్నారు. శివపార్వతుల కల్యాణోత్సవాన్ని ప్రధాన అర్చకులు ప్రవీణ్ అయ్యంగార్ ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలు, భక్త భజనలు, శివనామ స్మరణల నడుమ శాస్త్ర యుక్తంగా వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం 12గంటలకు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు సాయంత్రం ఐదు గంటలకు శివపార్వతుల ఊంజల సేవ కార్యక్రమం నిర్వహించారు. రాత్రి శివపార్వతుల ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామి అమ్మవార్లకు కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో దేవేంద్ర బాబు, సూపరిండెంటెంట్ జ్ఞాన ప్రకాష్, ఆలయ ఇన్స్పెక్టర్ వెంకటేష్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## ఎస్వీయూ దూరవిద్యకు అనుమతులు మంజూరు

### యూజీసీ అనుమతులు సాధించడంతో హర్షం

**తిరుపతి, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం దూరవిద్య విభాగం ఆధ్వర్యంలో నడిచే కోర్సులకు 2024 – 25 సంవత్సరానికి గాను, యు జి సి, డెబ్, అనుమతులు మంజూరు చేసింది. యుజిసి, డెబ్ గత 2022 సంఎఎ నుంచి ఎస్వీయూ దూర విద్య కోర్సుల కూ అనుమతులు మంజూరు చేయలేదు. గత జనవరిలో డెబ్ నుంచి వచ్చిన ఎక్స్పర్ట్ కమిటీ యూనివర్సిటీ నందు మూడు రోజులపాటు సుదీర్ఘంగా పరిశీలించి యుజిసి కి నివేదిక సమర్పించడం జరిగింది,ఈ నివేదిక పై యుజిసి పరిశీలించి గురువారం ఎస్వీయూ దూరవిద్య కోర్సులకు 2024 – 25 సం నుంచి అనుమతులను మంజూరు చేసింది.దీని ప్రకారం 17 పీజీ కోర్సులకు అనుమతి ఇచ్చింది.ఈ సందర్భంగా వర్సిటీ ఉపకులపతి ఆచార్య సిహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు హర్షం వ్యక్తం చేస్తూ ఈ అనుమతులు రావడానికి పనిచేసిన వర్సిటీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా ఈ సంవత్సరం నుంచే దూరవిద్య కోర్సులకు ప్రకటన ఇవ్వనన్నామని ఓ ప్రకటనలో వారు తెలిపారు.

## ఏపీలో అక్రిడేషన్ కార్డుల గడువు పొడిగింపు

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్



**తిరుపతి, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాలపరిమితిని మూడు నెలలు పాటు మార్చి 1, 2025 నుండి మే 31, 2025 వరకు లేదా కొత్త కార్డులు జారీ ప్రక్రియ చేయడం గానీ ఏది ముందు జరిగితే అప్పటివరకు పొడిగింపు ఉత్తర్వులు జారీచేస్తూ సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా, గురువారం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ప్రస్తుతం ఫిబ్రవరి 28,2025 నాటికి అక్రిడిటేషన్ కార్డులు కలిగి పనిచేయుచున్న పాత్రికేయులకు మాత్రమే మార్చి 1,2025 నుండి మే 31, 2025 వరకు పొడిగింపు సౌకర్యం కొనసాగుతుందని తెలిపారు. సంబంధిత మీడియా యాజమాన్యం వారు వారి సంస్థలో పని చేయుచున్న జర్నలిస్టుల వివరాలు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి, తిరుపతి వారి కార్యాలయంలో వీలైనంత తొందరగా అందచేయాలని ఒక ప్రకటనలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ తెలియజేశారు.

## కొనసాగుతున్న సేవ్ గురుకుల్ ఉత్తరాల ఉద్యమం



**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** సేవ్ గురుకుల్ ఉత్తరాల ఉద్యమాన్ని ప్రభుత్వం దిగివచ్చే వరకు కొనసాగించాలని ఘట్ కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్ తెలిపారు. ఘట్ కేసర్ పోస్టాఫీసు వద్ద సేవ్ గురుకుల్ ఉద్యమంలో భాగంగా పూర్వ విద్యార్థి దాసరి గణేష్ యాదవ్ ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు ఉత్తరాలను స్పీడ్ పోస్టు చేశారు. గురుకుల్ విద్యాలయానికి పూర్వ వైభవం కల్పించే వరకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని చెప్పారు. ప్రభుత్వం దిగిరాక పోతే ఉద్యమాన్ని తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కంది ప్రేమ్ కుమార్, కొత్తకొండ వెంకటేష్, మానుక కుమార్, అందెల అభిలాష్ యాదవ్, బాల కృష్ణ, నర్సింగ్, లంబ శేఖర్, అహ్మద్, ప్రసన్న, మహేపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో ఉత్సవమూర్తుల రథోత్సవం



**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** శ్రీకాళహస్తి స్వామి వారి దేవస్థానం నందు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయ అలంకార మండపం వద్ద స్వామి అమ్మవారి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి ఆలయం నుంచి ఊరేగింపుగా రథోత్సవం నిర్వహించారు. శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిని రథంపై కొలువు తీర్చి విశేష పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం స్వామి అమ్మవార్ల రథోత్సవం కనుల పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ తెలుగుదేశం పట్టణ అధ్యక్షులు విజయకుమార్ కంటా రమేష్ కాసారం రమేష్ బుజ్జి రవి ఉమేష్ దుర్గా వినయ్ వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

### పవన్ 50 కోట్ల లంచం.. నిరూపించక పోతే...

# ప్రజలు చెప్పులతో కొడతారు

- పవన్ కళ్యాణ్ పై దువ్వాడ శ్రీనివాస్ చేసిన ఆరోపణలు అవాస్తవం
- నిరూపించకుంటే తగిన మూల్యం తప్పదు
- చిత్తూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్




**తిరుపతి, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** దువ్వాడ శ్రీనివాస్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై చేసిన ఆరోపణలు అవాస్తవమని ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, నగర అధ్యక్షుడు రాజారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సుభాషినిలు తీవ్రంగా ఖండించారు. అందులో భాగంగా గురువారం పట్టణంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఆరోపణ చేశారు. స్థానిక తిరుపతి ప్రెస్ క్లబ్‌లో వారు మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 50కోట్లు తీసుకున్నాడని దువ్వాడ శ్రీనివాస్ తీవ్రమైన విమర్శలు గుప్పించారు. పవన్ కళ్యాణ్ సినిమాల తీస్తే రోజుకు రెండు కోట్ల రూపాయలు వస్తాయనే విషయం దువ్వాడ శ్రీనివాస్ గుర్తుంచుకోవాలన్నారు. ప్రజల కోసం తన లగ్జరీ జీవితాన్ని పక్కనపెట్టి ప్రజాసేవకై మా నాయకుడు రాజకీయాల్లోకి వచ్చాడని గుర్తు చేశారు.

ఎన్నికల సందర్భంలో రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చడానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చలు జరుపుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా దువ్వాడ శ్రీనివాస్ నోరు అదుపులో పెట్టుకోకపోతే మీ ఊర్లో వాళ్ళే చెప్పులతో కొడతారు. దువ్వాడ ప్రజాగ్రహానికి గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు. దువ్వాడ శ్రీనివాస్ పవన్ కళ్యాణ్ పై చేసినా ఆరోపణలు అవాస్తవామని, నిరూపించకుంటే తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో హేమ కుమార్, రాజమోహన్, సుమన్ బాబు, మునస్వామి, ఆనంద్, రాజేష్ ఆచారి, వినోద్, కిషోర్, ఆది, రమేష్, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

# ఖద్దరు చొక్కాలకే ఆదరణ

### ఇల్లందులో గందరగోళంగా సాంస్కృతిక కార్యక్రమం



**ఇల్లందు, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** ఇల్లందు పట్టణ జెకె సింగరేణి స్కూల్ డైమండ్ స్టేడియంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుల్లితెర నటీనటులతో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజా గాయకుడు నల్గొండ గద్దర్ మ్యూజికల్ నైట్ ప్రోగ్రాం ఏర్పాటు చేయబోతున్నట్లు గత నాలుగు రోజుల నుండి హడావిడి చేస్తూ, మైకులతో పబ్లిసిటీ చేసి ప్రజలు ఏ స్థాయిలో వస్తారో అంచనా లేకుండా ఏర్పాట్లు చేయడంపై మండిపడ్డ మహిళలు, వీఐపీ పాసులు ముద్రించి పట్టణంలోని పెద్దలకు, వ్యాపారస్తులకు పత్రికా విలేకరులకు ఇవ్వడం జరిగిందని తెలిపారు, 26న బుధవార. సాయంత్రం కార్యక్రమం ప్రారంభించగా పాస్ కలిగిన వాళ్లను పక్కకు నెట్టి ఖద్దర్ చొక్కాలకే ప్రాధాన్యత ఇవ్వటంపట్ల అనేకులు ఆగ్రహించారు. స్వయంగా వాళ్లే ఇచ్చిన విఐపి పాస్ లు కలిగి ఉన్నవాళ్లని, లోపలికి రానివ్వకుండా అడ్డుకోవడం పై కొందరు వీఐపీ పాస్‌లను చింపి వెనుదిరిగారు. పేరుకు పెద్ద సెట్టింగ్ తీరా చూస్తే కొందరికే ఆహ్వానాలు దానికి తోడు చోటామోటా లీడర్ల హల్చల్. వీఐపీ పాస్ కలిగిన వారి పట్ల చిన్న చూపుతో చీదరించినట్టు పేర్కొన్నారు.అధిక మెజార్టీతో గెలిపించుకున్న ఎమ్మెల్యేని పండగ సందర్భంగా పలకరించలేని పరిస్థితి నెలకొందన్నారు. కద్దర్లు వేస్తే హాయ్ బాయ్ సాదా సీదాగా ఉంటే సీదరింపు. నియోజకవర్గంలో ఉన్న ప్రజలందరినీ సమాన దృష్టితో చూడాలని పలువురు కోరారు. మనిషి భౌతికతను చూసి మాట్లాడడం తగదని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రజల మనిషి ప్రజలకు దగ్గరయ్యేలా ఉండాలే తప్ప దూరమయ్యేలా చూడరాదన్నారు. ఇప్పటికైనా పాస్‌ల పేరుతో ప్రజలని పక్కకు నెట్టకండి. అందరిని సమాన దృష్టితో చూడాలని. ఇలాంటి ప్రోగ్రాం కండక్ట్ చేసే ముందు ప్రజల పట్ల అంకిత భావం కలిగి ఉండాలని కోరారు.

### చిన్నారి పట్ల అసభ్య ప్రవర్తన...

## యువకుడిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు



**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** గంజాయి మత్తులో ఐదేండ్ల చిన్నారిపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ యువకున్ని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించిన సంఘటన ఘట్ కేసర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్ స్పెక్టర్ పి పరశురాం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఘట్ కేసర్ పట్టణానికి చెందిన కావటి శ్రీధర్(21) ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారి బాలిక(5) కు మాయ మాటలు చెప్పి స్థానికంగా ఉన్న చెట్ల పొదలలోకి తీసుకువెళ్లాడు. దుస్తులు విప్పి ఆసభ్యంగా ప్రవర్తించటంతో బాలిక కేకలు వేసింది. దీంతో స్థానికులు గమనించి యువకున్ని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించి అప్పగించారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు యువకున్ని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఘట్‌కేసర్‌లో చిన్నారి బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన యువకుడు నిత్యం గంజాయి మత్తులో తూగుతుంటాడని, మత్తులోనే బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు స్థానికులు పేర్కొన్నారు. విచ్చలవిడిగా గంజాయి సేవిస్తున్న యువకులను గుర్తించి కఠినంగా శిక్షించాలని స్థానికులు కోరారు.

## సంగమేశ్వర ఆలయంలో కుస్తీ పోటీలు



**నిజాంపేట్, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** సంగారెడ్డి జిల్లా గురువారం శ్రీ ఉమా సంగమేశ్వర దేవాలయం వద్ద శివరాత్రి పర్వదిన సందర్భంగా గుడి 50 వసంతాలు పూర్తి చేస్తున్న సందర్భంలో ఆలయ సభ్యులు,గ్రామ ప్రజల సహకారంతో కుస్తి పోటీలు నిర్వహించడం జరిగింది. ఇందులో వివిధ గ్రామాల మల్ల యోధులు పాల్గొని కుస్తీ పోటీలను విజయవంతం చేశారు చివరి కుస్తీలో అభిజిత్ ఐదువేల నగదు బహుమతిని గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

## తండ్రి జ్ఞాపకార్థం... రెండు కోట్లతో పాఠశాల భవనం

### సుమధుర ఫౌండేషన్ సహకారంతో


### జి.మధుసూదన్ సాయం




**రామన్నపేట, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం ఇస్కిల్ల గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రైమరీ స్కూలు ను సుమధుర ఫౌండేషన్ చైర్మన్ జి.మధుసూదన్ తన తండ్రి గుండా సత్తయ్య మెమోరియల్ స్కూల్‌గా మార్చి రెండు కోట్ల రూపాయలతో అద్భుతమైన సదుపాయాలు కల్పిస్తూ స్కూల్ బిల్డింగ్ నిర్మించారు. కంప్యూటర్లు ల్యాబ్ లైబ్రరీ డార్మెటరీ క్లాస్ రూమ్స్ అద్భుతంగా ఉన్నాయి. గురువారం ఆ స్కూల్ ని సందర్శించి వివరాల అడిగి తెలుసుకోవడం జరిగింది తాను తన తండ్రి పుట్టిన స్వగ్రామాన్ని మర్చిపోకుండా గ్రామంలో ప్రభుత్వ స్కూల్ కి తండ్రి పేరు పెట్టించి తన సొంత డబ్బులతో స్కూల్ నిర్మాణానికి కృషి చేశారు. సుమధుర ఫౌండేషన్ చైర్మన్ జి.మధుసూదన్ ని ప్రతి ఒక్కరు అభినందించాల్సిందే నేను స్వయంగా ఈరోజు ఆ స్కూల్ ని సందర్శించినాను ఇలాంటివి ప్రభుత్వం ప్రోత్సహించాలని కోరుతున్నానని మన్నే నర్సింహారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నారాయణపేటలో వేసవి యాక్షన్ ప్లాన్

### సమీక్ష సమావేశం నిర్వహించిన కలెక్టర్




**నారాయణపేట, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** రానున్న వేసవిలో త్రాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్ లో మిషన్ భగీరథ బడ్జెట్ పన్నుల వసూలు పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మిషన్ భగీరథ గురించి మాట్లాడుతూ గ్రామ గ్రామాన మిషన్ భగీరథ త్రాగునీరు సరఫరా అవుతున్నాయని వచ్చే వేసవిలో కూడా అలాగే సరఫరా చేయాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే తెలుపాలని అధికారులను ఆదేశించారు. వేసవి యాక్షన్ ప్లాన్ ప్రకారం ముందుకు వెళ్లాలని తెలిపారు. ఈ సందర్భంగా నారాయణపేట, మక్తల్, కోస్గి, మద్దూరు మున్సిపాలిటీ కమిషనర్లను ఆయా మున్సిపాలిటీలలో త్రాగునీటి సరఫరాపై పూర్తి వివరాలు తెలుసుకున్నారు. అలాగే బడ్జెట్ పై పన్నుల వసూళ్లపై మాట్లాడారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఈ. ఈ.మిషన్ భగీరథ గ్రిడ్ పి.వెంకటరెడ్డి,మున్సిపల్ కమిషనర్లు మిషన్ భగీరథ అధికారులు ఏ. ఈ. డిఈలు తదితరులు పాల్గొన్నారు.

### హెచ్ఎండిఏ అనుమతులు అంటూ...

# అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న అధికారులు

- తూముకుంటలో అక్రమ నిర్మాణాలు ఉన్నాయా..?
- అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ కమిషనర్ ఆశ్చర్యం
- ఉంటే నిర్మాణ పనులను నిలిపి వేస్తామని వివరణ
- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న అక్రమ నిర్మాణాలు
- హెచ్ఎండిఏ అనుమతులు అంటూ చేతులు దులిపేసుకుంటున్న వైనం





**శామీర్‌పేట, ఫిబ్రవరి 27 (నిఘా న్యూస్):** మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ మండలంలోని తూముకుంట మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలే దర్శనమిస్తున్నాయి. అధికారులను ప్రశ్నించగా హెచ్ఎండిఏ పర్మిషన్స్ అని సమాధానం చెప్పి చేతులు దులి పేసుకుంటున్న మున్సిపల్ అధికారులు. బహుళ అంతస్తులు నిర్మాణాలు నిర్మించేందుకు బిల్డర్లు హెచ్ఎండిఏ అనుమతులు తీసుకుంటారు. అనుమతులు తీసుకునేది ఒకలా, నిర్మాణాలు మరోలా నిర్మిస్తూ అధికారులకు ముడుపులు చెల్లించి అనుమతులకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు నిర్మిస్తూ బహుళ అంతస్తుల నిర్మాణాలు నిర్మిస్తూ ముందుకు సాగుతున్నారు.

ఎలాంటి సెట్ బ్యాక్ లేకుండా అపార్ట్మెంట్ మాత్రం ఐదు అంతస్తులు, ఆరు అంతస్తులు నిర్మాణాలు నిర్మిస్తూ ముందుకు పోతున్నారు. ఈ అక్రమ నిర్మాణ దారులు. ఫైర్ సేఫ్టీ ఏమాత్రం లేకుండా ఇలాంటి నిర్మాణాలు నిర్మిస్తూ వారి స్వార్థానికి అమాయక ప్రజలను మోసం చేసి డబ్బులు ఆర్జించే విధంగా ఈ నిర్మాణాలు నిర్మిస్తున్నారంటూ స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టిన అక్రమ నిర్మాణాలు నిర్మిస్తున్న వైపు కన్నెత్తి చూడకుండా చేతులు దులిపేసు కుంటున్నారు. ఒక్కసారి కూడా కానాల వైపు కన్నెత్తి చూడకుండా నిర్మిస్తూ వెళ్తున్న ఇప్పటికైనా అక్రమ నిర్మాణాల వైపు చూసి అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు నిర్మిస్తే ఆ నిర్మాణాలపై కొరడా ఝులిపించాలని అధికారులను ప్రజలు వేడుకుంటున్నారు.

### మున్సిపల్ కమిషనర్ వివరణ

అక్రమ నిర్మాణాలు తుముకుంట మున్సిపల్ సమీపంలో ఎక్కడ జరుగుతున్నాయో నా తెలియదంటూ, దురుసుగా సమాధానం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ అనుమతులకు విరుద్ధంగా ఎవ్వరైనా అక్రమ నిర్మాణాలు నిర్మిస్తే వారు ఎవరైనా సరే ఉపేక్షించేది లేదని కమిషనర్ వెంకట గోపాల్ స్పందించారు. ఎవరైనా సరే అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని వారి నిర్మాణాలను నిలిపివేస్తామని కమిషనర్ పేర్కొన్నారు.

Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com